thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

### రూ. 100కే ఫుట్ బాల్ క్లబ్




11

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 133| జగిత్యాల | శనివారం 15 ఆగస్టు, 2026 ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## జనగణన-2027కు కేంద్రం రెడీ

4



## విద్యార్థులపై చర్యలొద్దు!



- నాకు-వారికి మధ్య బీసీఐ జోక్యమేంటి?
- నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉంది
- నల్సార్ వివాదంపై చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ఘాటు వ్యాఖ్యలు
- ఆదేశాలు వెనక్కి తీసుకున్నామన్న బార్ కౌన్సిల్

4

నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయ విద్యార్థులపై చర్యలకు సిద్ధమైన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తీరుపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఇది నాకు, విద్యార్థులకు మధ్య ఉన్న విషయం. మా మధ్య జోక్యం చేసుకోవడానికి బార్ కౌన్సిల్ ఎవరు?" అంటూ ప్రశ్నించారు. విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేశారు.

## విభజన గాయాలు.. ఎన్నో జీవితాలు ఛిద్రం

- దేశ విభజనతో కుటుంబాలు చెల్లాచెదురయ్యాయి
- భయానక పరిస్థితుల నుంచి జీవితాలను పునర్నిర్మించుకున్నారు
- బాధితుల ధైర్యం, పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం
- 'పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డే' సందర్భంగా ప్రధాని

4





- 3.42 కోట్ల మంది లబ్ధిదారులకు ప్రయోజనం
- సన్నాలకు రూ.500 బోనస్.. మిగులు ధాన్యం ఈ-వేలం
- రూ.200 కోట్లతో ఆటోలను విద్యుత్ వాహనాలుగా మార్చే పథకం
- మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలకు రూ.2,100 కోట్లు

## టీడీఆర్‌పై కీలక నిర్ణయం

2

# రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు

### స్వాతంత్ర్య దినోత్సవం నుంచి పంపిణీకి కేబినెట్ నిర్ణయం




రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం మరో విప్లవాత్మక అడుగు వేసింది. రాష్ట్రంలోని 3.42 కోట్ల మంది రేషన్ లబ్ధిదారులకు అత్యాధునిక స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. రేపు స్వాతంత్ర్య దినోత్సవ శుభసందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించాల్సిందిగా అధికారులను ఆదేశించింది. గతంలో 2.81 కోట్ల మంది లబ్ధిదారులు ఉండగా, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా 62 లక్షల మందిని చేర్చడంతో ఈ సంఖ్య 3.42 కోట్లకు చేరింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన గురువారం నాడిక్కడ సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం రైతాంగ సంక్షేమం, పారిశ్రామికాభివృద్ధి, విద్య, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది.

*- హైదరాబాద్, ఆగస్టు 14 (ఉద్యమ కెరటం)*

2





## పూలే దంపతుల విగ్రహావిష్కరణ

2

హైదరాబాద్, ఆగస్ట్ 14: మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. భాగ్య నగరంలోని నెక్లెస్ రోడ్డులో ఏర్పాటు చేసిన విగ్రహాలను ఆయన శుక్రవారం ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.




2

- ముగ్గురు జూనియర్ కమాండోలకు గ్యాలంట్రీ మెడల్స్
- ఇద్దరికి విశిష్ట సేవా పతకాలు.. మరో పదిమందికి ప్రతిభా సేవా పతకాలు
- ధైర్యసాహసాలు, అంకితభావానికి దక్కిన అరుదైన గౌరవం

## తెలంగాణ పోలీసులకు పతకాల పంట

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 15 రాష్ట్రపతి పతకాలు

## రాజ్యాంగాన్ని గౌరవించుకోవాలి

- వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగాలి
- జాతిని ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం

2





## బోరులో మోటారు తీస్తుండగా కరెంట్‌షాక్

- తండ్రీకొడుకులు మృతి
- భూపాలపల్లి జిల్లా కొయ్యూరులో విషాదం

.. వివరాలు 3లో

## సీఎం రేవంత్ రెడ్డి భూ కుంభకోణం



2

- లోకాయుక్తలో బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు
- సోదరుడి కంపెనీకి ఐదెకరాల కేటాయింపుపై సీబీఐ, గవర్నర్ విచారణకు డిమాండ్
- రూ. 200 కోట్ల విలువైన భూమిని రూ. 7 కోట్లకే ధారాదత్తం చేశారని ఆరోపణ



## యూనిఫార్మ్ సర్వీసెస్ అభ్యర్థులకు ఊరట

మరో రెండేళ్ల వయో పరిమితి సడలింపు

తెలంగాణ ప్రభుత్వం జీఓ జారీ

3

## దేశ ఐక్యతే మన ధ్యేయం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు
- హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై బీజేపీ ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' భారీ యాత్ర
- హాజరైన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ఈటల, లక్ష్మణ్, దత్తాత్రేయ



2

## పార్టీ లైన్ దాటితే సహించం

- రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలను సీరియస్‌గా పరిగణిస్తాం
- మహేష్ కుమార్ గౌడ్



.. వివరాలు 3లో




## తెలంగాణ పోలీసులకు పతకాల పంట

**స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 15 రాష్ట్రపతి పతకాలు**

**ముగ్గురు జూనియర్ కమాండోలకు గ్యాలంట్రీ మెడల్స్**

**ఇద్దరికి విశిష్ట సేవా పతకాలు.. మరో పదిమందికి ప్రతిభా సేవా పతకాలు**

**ధైర్యసాహసాలు, అంకితభావానికి దక్కిన అరుదైన గౌరవం**

**హైదరాబాద్, ఆగస్టు 14:** తెలంగాణ పోలీసు శాఖకు అరుదైన గౌరవం దక్కింది. 2026 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర పోలీసు శాఖకు మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు ప్రకటించారు. విధి నిర్వహణలో చూపిన ధైర్యసాహసాలు, అంకితభావం, విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పతకాలు దక్కాయి. మొత్తం 15 పతకాల్లో మూడు గ్యాలంట్రీ మెడల్స్, రెండు విశిష్ట సేవా పతకాలు, పది ప్రతిభావంతమైన సేవా పతకాలు ఉన్నాయి. వీరత్వానికి ప్రతీకగా అందించే గ్యాలంట్రీ మెడల్స్‌కు తెలంగాణకు చెందిన ముగ్గురు జూనియర్ కమాండోలు బి. సత్యారావు, కె. సందీప్‌కుమార్, జె. వంశీకృష్ణ ఎంపికయ్యారు. విధి నిర్వహణలో ప్రదర్శించిన అసాధారణ ధైర్యసాహసాలు, తెగువకు గుర్తింపుగా వీరికి ఈ పురస్కారం ప్రకటించారు. దీర్ఘకాలంగా అత్యుత్తమ సేవలు అందించిన వారికి ఇచ్చే విశిష్ట సేవా పతకాల విభాగంలో తెలంగాణ నుంచి ఇద్దరు ఎంపికయ్యారు. విధి నిర్వహణలో నిబద్ధత, సమర్థతతోపాటు వారి సేవా ప్రస్థానాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ గౌరవానికి ఎంపిక చేశారు. పోలీసు విధుల్లో ప్రతిభ, అంకితభావం, నిరంతర సేవలను గుర్తిస్తూ మరో పది మందికి ప్రతిభావంతమైన సేవా పతకాలు ప్రకటించారు. దీంతో ఈసారి తెలంగాణ పోలీసు శాఖ ఖాతాలో మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు చేరాయి. ప్రతి ఏటా స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీసు, అగ్నిమాపక, హోంగార్డ్స్, పౌర రక్షణ, కారాగార సేవల విభాగాల్లో విశేష సేవలందించిన సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం పతకాలను ప్రకటిస్తుంది.

## టీడీఆర్‌పై కీలక నిర్ణయం

**హైదరాబాద్, ఆగస్ట్ 14:** ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ టిడిఆర్‌పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టీడీఆర్ జారీ, వినియోగ నిబంధనల్లో మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీవో 218 ద్వారా తెలంగాణ బిల్డింగ్ రూల్స్–2012లో సవరణలు చేసింది. దీని ద్వారా హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ పరిధిలో టీడీఆర్ వినియోగానికి మరింత వెసులుబాటు కల్పించినట్లైంది. నూతన జీవో ప్రకారం.. ఇకపై, హెచ్‌ఎండీఏ చేపట్టే ప్రాజెక్టుల కోసం అవసరమైన/స్వాధీనం చేసుకున్న భూములకు ఆ సంస్థే టీడీఆర్ సర్టిఫికెట్లు జారీ చేయనుంది. జిహెచ్ఎంసి పరిధి సహా సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో ప్రజా ప్రయోజన/ప్రాజెక్టుల కోసం ఇచ్చే భూములకూ ఈ నియమం వర్తించనుంది. హెచ్‌ఎండీఏ జారీ చేసే టీడీఆర్ సర్టిఫికెట్‌ను ఆ సంస్థ పరిధిలో ఎక్కడైనా వినియోగించుకోవచ్చు/డిస్పోజ్ చేసుకోవచ్చు. అలాగే టీడీఆర్ జారీ ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్‌లోనే నిర్వహించనున్నారు. అదేవిధంగా టీడీఆర్‌కు సంబంధించిన వివరాలు, లెక్కలు, వినియోగంపై ఏకరీతి విధానాన్ని ప్రభుత్వం అమలు చేయనుంది. ఈ మేరకు సంబంధిత మున్సిపల్ కార్పొరేషన్లకు టీడీఆర్ సర్టిఫికెట్ కాపీ అందజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. బిల్డ్ నౌ వ్యవస్థలో టీడీఆర్ ప్రాసెసింగ్, జారీ, అకౌంటింగ్, వినియోగానికి అవసరమైన మార్పులూ చేసింది. గెజిట్‌లో ప్రచురించిన తేదీ నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి వస్తాయని ప్రభుత్వం తెలిపింది.

## బోరులో మోటారు తీస్తుండగా కరెంట్ షాక్

**తండ్రీకొడుకులు మృతి**

**భూపాలపల్లి జిల్లాలో విషాదం**

**గ్రామంలో మిన్నంటిన రోదనలు**

**జయశంకర్ భూపాలపల్లి, ఆగస్టు 14:** వ్యవసాయ బావి వద్ద బోరు మోటారు తీస్తుండగా చోటుచేసుకున్న విద్యుత్ ప్రమాదంలో తండ్రీకొడుకులు ప్రాణాలు కోల్పోయిన విషాదకర ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హార్ మండలం కొయ్యూరులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటారం మండలం మార్వాడిపల్లి గ్రామానికి చెందిన కొట్టేకోళ్ల బాపు (48), ఆయన కుమారుడు మనోజ్ (20) తమ కొయ్యూరు శివారులోని వ్యవసాయ భూమి వద్దకు బోరు మోటారు తీసేందుకు వెళ్లారు. మోటారును పైకి తీస్తున్న క్రమంలో అనుకోకుండా విద్యుత్ షాక్‌కు గురై వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఒకే కుటుంబానికి చెందిన తండ్రీకొడుకులు ప్రాణాలు కోల్పోవడంతో మార్వాడిపల్లి, కొయ్యూరు గ్రామాల్లో తీవ్ర శోకఛాయలు అలముకున్నాయి. కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాలను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



# రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు

- స్వాతంత్ర్య దినోత్సవం నుంచి పంపిణీకి కేబినెట్ నిర్ణయం
- 3.42 కోట్ల మంది లబ్ధిదారులకు ప్రయోజనం
- సన్నాలకు రూ.500 బోనస్.. మిగులు ధాన్యం ఈ-వేలం
- రూ.200 కోట్లతో ఆటోలను విద్యుత్ వాహనాలుగా మార్చే పథకం
- మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలకు రూ.2,100 కోట్లు




**హైదరాబాద్, ఆగస్టు 14:** రాష్ట్రంలోని రేషన్ కార్డుదారులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్మార్ట్ కార్డుల పంపిణీని ప్రారంభించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. గతంలో రాష్ట్రంలో 2.81 కోట్ల మంది రేషన్ లబ్ధిదారులు ఉండగా, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త కార్డుల జారీ, కుటుంబ సభ్యుల పేర్ల నమోదుతో మరో 62 లక్షల మందికి ప్రయోజనం చేకూరిందని ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 3.42 కోట్ల మంది రేషన్ లబ్ధిదారులు ఉన్నారని పేర్కొంది. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2.0ను డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించాలని మంత్రివర్గం ప్రాథమికంగా నిర్ణయించింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామితో ఉపసంఘాన్ని ఏర్పాటు చేయనుంది. 'ఇన్వెస్ట్ తెలంగాణ' ఇతివృత్తంతో జరిగే సదస్సులో ఫ్యూచర్ సిటీ ప్రణాళికను ఆవిష్కరించనున్నారు. రక్షణ, అంతరిక్ష, ఔషధ రంగాల్లో పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయాలని నిర్ణయించారు. వానాకాలంలో ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. రైతు వేదికలు, గ్రామ పంచాయతీల ద్వారా రైతులకు విస్తృత అవగాహన కల్పించనుంది. ఈ ఏడాది నుంచి నిర్ణయించిన ఏడు రకాల సన్న ధాన్యానికే క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించాలని తీర్మానించింది. యాసంగిలో ప్రభుత్వం 81.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసిందని, అందులో కేంద్రం 63.62 లక్షల మెట్రిక్ టన్నులు సేకరిస్తుందని తెలిపింది. మిగిలిన 17.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని క్వింటాలుకు రూ.2,389 ప్రాథమిక ధరతో ఈ–వేలం ద్వారా విక్రయించేందుకు మంత్రివర్గం ఆమోదించింది. రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఇందుకు అవసరమైన చట్టపరమైన మార్పులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి కేబినెట్ పచ్చజెండా ఊపింది. వీటితో ఇప్పటివరకు 86 స్కూల్ కాంప్లెక్స్‌లకు అనుమతులు లభించాయి. నిర్మాణాలు పూర్తయిన చోట వచ్చే విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించాలని నిర్ణయించింది. హైదరాబాద్‌ను హరిత నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రస్తుతం ఉన్న 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలను విద్యుత్ వాహనాలుగా మార్చేందుకు రూ.200 కోట్లతో ప్రత్యేక పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1.50 లక్షల సబ్సిడీ ఇవ్వనుంది. ప్రస్తుతం ఉన్న ఆటోకు విద్యుత్ కిట్ అమర్చుకోవడం లేదా పాత వాహనాన్ని తొలగించి కొత్త విద్యుత్ ఆటో కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పించనుంది. నగరంలోని కాలుష్యకారక పరిశ్రమలను శివార్లకు తరలించే విధానానికి సంబంధించిన దరఖాస్తుల గడువును అక్టోబర్ 31 వరకు పొడిగించాలని కూడా మంత్రివర్గం నిర్ణయించింది. మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల రెండో దశ పనులకు రూ.2,100 కోట్ల అంచనా వ్యయానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పథకంతో దాదాపు లక్ష ఎకరాలకు సాగునీటితోపాటు తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గూడెం దొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీల నుంచి 15 టీఎంసీలకు పెంచడంతోపాటు సౌర విద్యుత్ ఉత్పత్తి అవకాశాలపై అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్‌ను నియమించడానికి కూడా రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

# చదువుతోనే ఆత్మగౌరవం, గుర్తింపు : సీఎం రేవంత్ రెడ్డి

**విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తున్నాం..**

**నర్సరీ నుంచే ఉచిత బ్రేక్‌ఫాస్ట్**

**పూలే దంపతుల విగ్రహావిష్కరణ సభలో కేసీఆర్ సర్కార్‌పై ముఖ్యమంత్రి తీవ్ర విమర్శలు**



**హైదరాబాద్, ఆగస్టు 14 :** చదువుతోనే సమాజంలో ఆత్మగౌరవం, గుర్తింపు లభిస్తాయని, విద్య ఒక్కటే పేదల తలరాతలను మార్చే ఏకైక మార్గమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. నెక్లెస్ రోడ్డులో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను ఆయన ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ.. 150 ఏళ్ల క్రితమే జ్యోతిబా పూలే చదువే ఏకైక మార్గమని చాటారని, తాను చదువుకోవడమే కాకుండా భార్యను చదివించి దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు సరసన పూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరించుకోవడం గర్వకారణమని, దీంతో నెక్లెస్ రోడ్ చౌరస్తా అద్భుతంగా మారిందని అన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తున్నామని, నర్సరీ నుంచే విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు అన్ని వసతులు కల్పిస్తున్నామని సీఎం తెలిపారు. కుల రహిత సమాజ స్థాపన, సామాజిక చైతన్యం కోసం అందరూ కలిసి చదువుకునేలా 'ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు' తీసుకొస్తున్నామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ఏటా రూ. 2,400 కోట్లను ముందే జమ చేసే విధానాన్ని ఈ ఏడాది నుంచే అమలు చేస్తున్నామని, దరఖాస్తు చేసిన నెల రోజుల్లోనే నిధులు జమ అవుతాయని చెప్పారు. ఫీజు బకాయిల పేరుతో ఏ కళాశాలా విద్యార్థుల సర్టిఫికెట్లను ఆపడానికి వీల్లేదని హెచ్చరించారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యతో పాటు ఉపాధికి అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను నేర్పిస్తున్నామని, టాటా సంస్థతో కలిసి 119 నియోజకవర్గాల్లో ఏటీసీలు ఏర్పాటు చేసి విద్యార్థులకు నెలకు రూ. 2,000 స్టైపెండ్ ఇస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ.. కేసీఆర్ ప్రభుత్వం బీసీలను కుల విద్యలకే పరిమితం చేస్తూ గొర్రెలు, బర్రెలు పెంచుకోవాలని, చేపలు పట్టుకోవాలని చెప్పి విద్యకు దూరం చేసిందని ఆరోపించారు. బీసీలు చదువుకుని ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, మంత్రులు, ఎమ్మెల్యేలు కాకూడదా అని ప్రశ్నించారు. మాదిగల దశాబ్దాల కల అయిన ఎస్సీ వర్గీకరణను పరిష్కరించామని, బ్రిటిష్ పాలన తర్వాత దేశంలోనే తొలిసారిగా ఏడాదిలోనే పారదర్శకంగా కులగణన పూర్తి చేశామని స్పష్టం చేశారు. అలాగే క్రీడల్లో పతకాలు తెచ్చిన సిరాజ్, నిఖత్ జరీన్, దీప్తి వంటి క్రీడాకారులకు ఉద్యోగాలు ఇచ్చామని, క్రీడాకారులను ఆదుకోవడానికి యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం రోజుకు 18 గంటలు పనిచేస్తానని, ప్రజాపాలనను కొనసాగించేలా ప్రజలు ఆశీర్వదించాలని సీఎం కోరారు.

## సీఎం రేవంత్ రెడ్డి భూ కుంభకోణం

**లోకాయుక్తలో బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు**

**సోదరుడి కంపెనీకి ఐదెకరాల కేటాయింపుపై సీబీఐ, గవర్నర్ విచారణకు డిమాండ్**

**రూ. 200 కోట్ల విలువైన భూమిని రూ. 7 కోట్లకే దారదత్తం చేశారని ఆరోపణ**



**హైదరాబాద్, ఆగస్టు 14 :** సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యుల భూ కుంభకోణంపై బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు శుక్రవారం లోకాయుక్త జస్టిస్ రాజశేఖర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, డాక్టర్ సంజయ్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ క్రిషాంగ్, లీగల్ సెల్ అడ్వకేట్ లలిత రెడ్డి తదితరులు లోకాయుక్తను కలిసి సమగ్ర వినతిపత్రం, ఆధారాలను అందజేశారు. సీఎం సోదరుడు కొండల్ రెడ్డికి చెందిన 'టెస్సెరాక్ట్' కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో రూ. 200 కోట్ల విలువైన 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేవలం రూ. 7 కోట్లకే దారదత్తం చేశారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఏరోస్పేస్ కంపెనీగా చెప్పుకుంటున్న ఈ సంస్థ చెల్లించిన మూలధనం కేవలం రూ. 1 లక్ష మాత్రమేనని, వారి అధికారిక నివేదికల ప్రకారమే కంపెనీలో ఉద్యోగుల సంఖ్య 'సున్నా' అని దాసోజు శ్రవణ్ విమర్శించారు. కేవలం ఒక నివాస ఫ్లాట్ చిరునామాతో నడుస్తున్న కంపెనీకి అంతటి విలువైన డిఫెన్స్ కేటగిరీ భూములను ఎలా కేటాయిస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ విషయమై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీయడంతో రాత్రికి రాత్రే వెబ్‌సైట్‌లో వివరాలను మార్చేసారని, సీఎం సోదరుడు కొండల్ రెడ్డి చైర్మన్‌గా, సీఎం మేనల్లుడు నయన్ రెడ్డి సీఈవోగా ఉన్నారని నిరూపించే ఆధారాలను లోకాయుక్తకు సమర్పించామని తెలిపారు. భూ కేటాయింపులపై మంత్రి శ్రీధర్ బాబు అసెంబ్లీలో అబద్ధాలు చెబితే, కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఈ కేటాయింపులను స్వయంగా ఒప్పేసుకున్నారని పేర్కొన్నారు. కర్ణాటకలోని 'ముడా' (వీఖణూ) స్కామ్ తరహాలోనే తెలంగాణలో ఈ భూ కేటాయింపుల కుంభకోణం సాగిందని దుయ్యబట్టారు. వెంటనే ఈ భూ కేటాయింపులను రద్దు చేయాలని, సీఎం రేవంత్ రెడ్డి పాత్రపై సమగ్ర విచారణ నిమిత్తం నివేదికను గవర్నర్‌కు పంపాలని బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం డిమాండ్ చేసింది. అలాగే మంత్రి శ్రీధర్ బాబుతో పాటు టీజీఐఐసీ అధికారులపై అవినీతి నిరోధక చట్టం మరియు బీఎన్ఎస్ సెక్షన్ల కింద విచారణ జరిపించాలని కోరారు.

## రాజ్యాంగాన్ని గౌరవించుకోవాలి

**వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగాలి**

**జాతిని ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 14:** భారత రాజ్యాంగాన్ని మనం గౌరవించాలని, వికసిత్ భారత్ లక్ష్యంగా అందరూ పని చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సందేశమిచ్చారు. అభివృద్ధి ఫలాలు దేశంలోని ప్రతి ఒక్కరికీ అందాలని ఆమె ఆకాంక్షించారు. అంతేకాదు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను మనం గుర్తుంచుకోవాలని రాష్ట్రపతి తన సందేశంలో పేర్కొన్నారు. తెల్లారితే ఎనభయో స్వాతంత్య దినోత్సవ వేడుకలతో యవాత్ భారతావని పులకించనుంది. ఈ చరిత్రాత్మక రోజును పునస్కరించుకొని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతినుద్దేశించి ప్రసంగించారు. రాజ్యాంగాన్ని గౌరవించాలని సూచించిన ఆమె.. న్యాయ వ్యవస్థను, చట్టసభలను మనం గౌరవించాలని ప్రజలకు సందేశమిచ్చారు. తాజాగా లోక్‌సభ్‌లో మొట్టమొదటిసారిగా ఆలపించిన వందేమాతరం గీతాన్ని పౌరులంతా గౌరవించాలని ఈ సందర్భంగా రాష్ట్రపతి కోరారు. వికసిత్ భారత్–2047 లక్ష్యంగా అందరూ పనిచేయాలని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము పిలుపునిచ్చారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ భారత్ బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతినుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. దేశానికి రాజ్యాంగమే దిక్సూచి అని.. దాన్ని గౌరవించాలని కోరారు. 'జన్‌ధన్ ద్వారా దేశవ్యాప్తంగా 59 కోట్ల మందికి బ్యాంకు ఖాతాలు అందించాం. 80 కోట్ల మందికి రేషన్ సరకులు అందజేస్తున్నాం. ఆయుష్మాన్ భారత్ ద్వారా 60 కోట్ల మందికి వైద్యసేవలు అందుతున్నాయి. కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా వ్యవసాయం, అనుబంధ రంగాలు బలోపేతమయ్యాయి. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగాలి. ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకున్నాం. కుగ్రామాల్లోనూ డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు. ప్రపంచంలోనే అత్యధిక డిజిటల్ లావాదేవీలు మనదేశంలోనే జరుగుతున్నాయి' అని రాష్ట్రపతి పేర్కొన్నారు.



# దేశ ఐక్యతే మన ధ్యేయం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు
- ట్యాంక్‌బండ్‌పై బీజేపీ ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' భారీ యాత్ర
- హాజరైన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి, ఎంపీలు ఈటల, లక్ష్మణ్, దత్తాత్రేయ



**హైదరాబాద్, ఆగస్టు 14 :** దేశం కోసం అవసరమైతే త్యాగాలు చేయాలనే స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలని, జాతీయ ఐక్యత, దేశ సమగ్రత కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై 'హర్ ఘర్ తిరంగా' భారీ యాత్రను నిర్వహించారు. బషీర్‌బాగ్‌లోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ప్రారంభమైన ఈ యాత్ర, అంబేద్కర్ విగ్రహం నుంచి స్వామి వివేకానంద విగ్రహం వరకు త్రివర్ణ పతాకాలతో ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ప్రతి ఇంటా జాతీయ జెండా రెపరెపలాడుతోందన్నారు. జాతీయ జెండా కోసం ప్రాణాలర్పించిన కాకతీయ వర్సిటీ ఏబీవీపీ నాయకుడు సామ జగన్ మోహన్ రెడ్డి త్యాగాన్ని స్మరించుకున్నారు. పార్లమెంటులో 'వందేమాతరం' గీతాన్ని వ్యతిరేకించిన మజ్లిస్ నాయకులపై చర్యలు తీసుకునే ధైర్యం సీఎం రేవంత్ రెడ్డికి ఉందా అని ఈ సందర్భంగా ఆయన సవాల్ విసిరారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. త్యాగధనుల చరిత్రను నేటి యువతకు గుర్తు చేయడానికే ఈ యాత్ర అని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అలాగే రాష్ట్ర కేబినెట్‌తో పాటు పదవుల్లో 'జెన్ జీ'లకు ప్రాధాన్యమివ్వాలని కాంగ్రెస్‌ను డిమాండ్ చేశారు. ఈ యాత్రలో పాల్గొన్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. భాషలు, ప్రాంతాలు వేరైనా మనమంతా భరతమాత బిడ్డలమని, 'దేశమే ప్రథమం' అనే భావనతో ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు, వివిధ రంగాల ప్రముఖులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# నేను కాంగ్రెస్ నాయకులను విమర్శించలేదు

- పార్టీని నమ్ముకున్న వారికే గుర్తింపు దక్కాలి
- బయటి నుంచి వచ్చిన వారి పెత్తనం పెరగకూడదన్నదే నా మాట
- కాంట్రాక్టర్ల చెప్పుచేతల్లో ప్రభుత్వం నడవొద్దు
- రాహుల్ నాయకత్వంలోనే కాంగ్రెస్‌లో కొనసాగుతా
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టీకరణ



**యాదాద్రి భువనగిరి, ఆగస్టు 14:** కాంగ్రెస్ పార్టీలో బయటి నుంచి వచ్చిన వారి పెత్తనం ఎక్కువైందంటూ తాను చేసిన వ్యాఖ్యలు పార్టీలో దుమారం రేపిన నేపథ్యంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వివరణ ఇచ్చారు. తాను కాంగ్రెస్ పార్టీని గానీ, పార్టీ నాయకులను గానీ ఎక్కడా విమర్శించలేదని, భవిష్యత్తులోనూ విమర్శించబోనని స్పష్టం చేశారు. పార్టీని దశాబ్దాలుగా నమ్ముకుని జెండా మోసిన నాయకులు, తెలంగాణ ఉద్యమకారులకు ప్రజాపాలనలో తగిన గుర్తింపు లభించాలన్నదే తన ఉద్దేశమని చెప్పారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం రాజగోపాల్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తన వ్యాఖ్యలను పార్టీపై విమర్శలుగా చూడటం సరికాదన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తు, అభివృద్ధి కూడా కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలోనే తాను కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతానని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌ను నమ్ముకుని దశాబ్దాలుగా పనిచేసిన నాయకులు, కార్యకర్తలతో పాటు తెలంగాణ ఉద్యమంలో పోరాడిన వారికి ప్రభుత్వంలో సముచిత గౌరవం, గుర్తింపు దక్కాలన్నారు. బయటి నుంచి వచ్చిన వారి ఆధిపత్యం పెరగకూడదన్నదే తన అభిప్రాయమని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం లేదా కాంగ్రెస్ పార్టీ సీమాంధ్ర పాలకులు, కాంట్రాక్టర్ల చెప్పుచేతల్లో నడవకూడదని రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజాపాలన అంటే పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం పనిచేయడం కాదని, పేద ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని స్పష్టం చేశారు. తన వ్యాఖ్యల వెనుక పార్టీని ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశం లేదని, అసలైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం జరగాలన్నదే తన ఆకాంక్ష అని రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

# సీఎం డైరెక్షన్‌లో ఐఏఎస్‌ల దందా

## ఆయన కనుసన్నల్లోనే 'నిషేధిత జాబితా'

## ఎంపీ ఈటల రాజేందర్ సంచలన ఆరోపణలు

**హైదరాబాద్, ఆగస్టు 14 :** తెలంగాణలోని పలువురు ఐఏఎస్ అధికారుల వ్యవహారశైలిపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ గురువారం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో భూముల నిషేధిత జాబితా (22ఏ) వ్యవహారం నేరుగా ముఖ్యమంత్రి కనుసన్నల్లోనే సాగుతోందని సంచలన ఆరోపణలు చేశారు. డబ్బులు వసూలు చేయడానికే దందా హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో భాగంగానే కొంతమంది ఐఏఎస్ అధికారులు ఉద్దేశపూర్వకంగా విలువైన భూములను నిషేధిత జాబితాలో పెడుతున్నారని ఆరోపించారు. "అధిక విలువ ఉన్న భూముల వద్దే ఈ తరహా దందా నడుస్తోంది. బాధితుల నుంచి డబ్బులు వసూలు చేయడంలో భాగమే ఈ చర్యలు" అని ఆయన వ్యాఖ్యానించారు. కలెక్టరేట్ల చుట్టూ బాధితుల ప్రదక్షిణలుము–ఖ్యమంత్రి కార్యాలయం నుంచి గానీ, లేదా ఆయనకు అత్యంత సన్నిహితులైన వారి నుంచి గ్రీన్ సిగ్నల్ లేదా క్లారిఫికేషన్ వచ్చిన తర్వాత మాత్రమే ఆయా భూములకు క్లియరెన్స్ ఇస్తున్నారని ఈటల మండిపడ్డారు. భూముల క్లియరెన్స్ కోసం సామాన్య ప్రజలు, బాధితులు కాళ్లు అరిగేలా కలెక్టర్ కార్యాలయాలు, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దల అండదండలతో సాగుతున్న ఈ అక్రమాలను తక్షణమే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.



# కేసీఆర్ బావమరిది జోగినపల్లి శ్రీనివాసరావు మృతి

- భౌతికకాయానికి కేసీఆర్, కేటీఆర్ నివాళులు
- అనారోగ్యంతో యశోద దవాఖానలో చికిత్స పొందుతూ కన్నుమూత
- సుచిత్రలోని నివాసానికి చేరుకుని నివాళులర్పించిన కేసీఆర్
- కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటామని భరోసా



**హైదరాబాద్, ఆగస్టు 14 :** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్ రావు బావమరిది, కరీంనగర్ జిల్లా బోయినపల్లి మండలం కొదురుపాకకు చెందిన జోగినపల్లి శ్రీనివాసరావు (68) అనారోగ్యంతో కన్నుమూశారు. గత కొంతకాలంగా అస్వస్థతతో బాధపడుతున్న ఆయన సికింద్రాబాద్‌లోని యశోద దవాఖానలో చికిత్స పొందుతూ గురువారం వేకువజామున తుదిశ్వాస విడిచారు. పార్థివదేహానికి కేసీఆర్ కడసారి వీడ్కోలుమరణవార్త తెలిసిన వెంటనే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి నివాసం నుంచి నేరుగా హైదరాబాద్ కొంపల్లి సమీపంలోని సుచిత్ర వద్ద గల శ్రీనివాసరావు అపార్ట్‌మెంట్‌కు చేరుకున్నారు. ఆయన భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించి అశ్రు నయనాలతో నివాళులర్పించారు. అనంతరం తీవ్ర శోకతప్తులైన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. "ఎవరూ అధైర్యపడవద్దు, కుటుంబానికి మేము పూర్తి అండగా ఉంటాం" అని కేసీఆర్ భరోసా ఇచ్చారు. కేసీఆర్‌తో పాటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు మరియు పలువురు ముఖ్య నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. గ్రామంలో తీవ్ర విషాదంశ్రీనివాసరావు మృతితో ఆయన స్వగ్రామమైన కొదు–రుపాకతో పాటు కుటుంబ సభ్యుల్లో తీవ్ర విషాదం నెలకుంది. ఆయన తన జీవితకాలంలో స్వగ్రామంలో ఆలయాల నిర్మాణం, అభివృద్ధి పనులు, నిరుపేదలకు ఆర్థిక సాయం అందించడంలో ఎల్లప్పుడూ ముందుండేవారని గ్రామస్థులు గుర్తుచేసుకున్నారు. అమెరికాలో ఉన్న ఆయన కుమారుడు నగరానికి చేరుకున్న అనంతరం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ వర్గాలు తెలిపాయి.



# స్మార్ట్ రేషన్ కార్డులపై మోడీ ఫోటో పెట్టాలి

## అన్ని సరుకులను ప్రజలకు ఇవ్వాలి

## బీజేపీ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** తెలంగాణ ప్రభుత్వం జారీ చేసే స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో లేకపోవడంపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఫొటో కచ్చితంగా పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. కేంద్రం తన వాటా కింద ఇచ్చే బియ్యానికి రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం లేదని రఘునందన్ రావు ఆక్షేపించారు. కేంద్రమే అధిక మొత్తంలో బియ్యం వాటా ఇస్తోందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే ఆరు కిలోల బియ్యంలో ఐదు కిలోలు కేంద్రం ఇస్తున్నవేనని ఎంపీ పేర్కొన్నారు. ఒక్క కిలో బియ్యం ఇస్తూ కార్డుపై ముగ్గురు కాంగ్రెస్ నేతల ఫొటోలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలతో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వడాన్ని రఘునందన్ రావు ఆక్షేపించారు. మోదీ ఫొటో లేకపోవడంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 1.06 కోట్ల రేషన్ కార్డుల పంపిణీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే సుమారు 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, కొత్తగా ఎన్ని ఇస్తున్నారో ప్రభుత్వం వెల్లడించాలన్నారు. రేషన్ కార్డుల ముద్రణ ఖర్చులు, టెండర్ల వివరాలు బయటపెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎంపీ డిమాండ్ చేశారు. కార్డుల ముద్రణ కాంట్రాక్ట్ ఎవరికి ఇచ్చారు, ఎన్ని కోట్లు ఖర్చు చేస్తున్నారనే వివరాలను వెల్లడించాలన్నారు. అదేవిధంగా, రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, వారికి గౌరవ వేతనం చెల్లించాలని పేర్కొన్నారు. పెంచిన రేషన్ డీలర్ల కమిషన్‌ను వెంటనే ఇవ్వాలని, బియ్యంలో నూకలు ఎక్కువగా ఉన్నాయన్న ఫిర్యాదులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రేషన్ కార్డుల ద్వారా తెలంగాణలోని పేదలకు మరిన్ని నిత్యావసర సరకులు అందించాలని సూచించారు. కర్ణాటక తరహాలో కందిపప్పు, నూనె, రాగులు, చక్కెర, గోధుమలు ఇవ్వాలని.. బియ్యం వద్దనుకునే వారికి ప్రత్యామ్నాయ ఆహార ధాన్యాలు అందించాలన్నారు. పేదల ఆహార భద్రతపై కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలని అన్నారు. అలాగే, రేషన్ కార్డుల పంపిణీని పునఃపరిశీలించాలని, మోదీ ఫొటోతో కొత్త కార్డులు ముద్రించాలని ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు.

# యూనిఫార్మ్డ్ సర్వీసెస్ అభ్యర్థులకు ఊరట

## మరో రెండేళ్ల వయో పరిమితి సడలింపు

## తెలంగాణ ప్రభుత్వం జీఓ ఎంఎస్ నం.122 జారీ

**హైదరాబాద్, ఆగస్టు 14 :** తెలంగాణలో యూనిఫార్మ్డ్ సర్వీసెస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాబోయే ప్రత్యక్ష నియామకాలలో గరిష్ఠ వయోపరిమితిని మరో రెండేళ్లు పెంచుతూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జీఓ ఎంఎస్ నం.122ను విడుదల చేసింది. ఈ వయో సడలింపు పోలీస్, అగ్నిమాపక, జైళ్లు, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, ఎక్సైజ్, రవాణా, అటవీ శాఖల్లోని యూనిఫార్మ్డ్ పోస్టులకు వర్తించనుంది. గతంలో ప్రభుత్వం ఐదేళ్ల వయో సడలింపు ఇవ్వగా, తాజాగా దానికి అదనంగా మరో రెండేళ్లు పెంచడంతో అభ్యర్థులకు మొత్తం ఏడేళ్ల అదనపు వయో సడలింపు లభించనుంది. లాక్‌డౌన్, నోటిఫికేషన్ల ఆలస్యం రీత్యా వయోపరిమితి పెంచాలని నిరుద్యోగ యువత నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించిన అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 14న తెలంగాణ రాష్ట్ర గెజిట్‌లో ఈ నోటిఫికేషన్ ప్రచురించాలని ఆదేశిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ చేశారు.

# పార్టీ లైన్ దాటితే సహించం

## రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలను సీరియస్‌గా పరిగణిస్తాం

## పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకు వెళతాయని స్పష్టం

## టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, ఆగస్టు 14 :** పార్టీ క్రమశిక్షణ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బహిరంగంగా మాట్లాడటం సబబు కాదని, ఆయన వ్యాఖ్యలను పార్టీ సీరియస్‌గా పరిగణిస్తోందని తెలిపారు. ఈ వ్యవహారంపై అధిష్ఠానం కూడా దృష్టి సారించిందన్నారు. రాజగోపాల్ రెడ్డి తనకు మంచి మిత్రుడని, ఆయన ఆవేదనను అర్థం చేసుకున్నప్పటికీ ఎవరైనా పార్టీ లైన్ దాటి మాట్లాడితే సహించేది లేదన్నారు. పార్టీనే తమకు మొదటి ప్రాధాన్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన అప్పుల ప్రభావం ప్రస్తుతం కనిపిస్తోందని విమర్శించారు. 2018 నుంచి అనేక బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ముఖ్యమంత్రి సహాయ నిధికి సంబంధించిన నిధులు విడుదలయ్యాయని చెప్పారు. అందరినీ సంతృప్తిపరిచేలా నిర్ణయాలు తీసుకోవాలనుకున్నా రాష్ట్రంపై ఉన్న అప్పుల భారం అడ్డంకిగా మారుతోందన్నారు. తమిళనాడు, తెలంగాణ రాజకీయ పరిస్థితులు వేర్వేరని పేర్కొన్న మహేష్ కుమార్ గౌడ్, సన్న బియ్యం పంపిణీ వంటి కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకు సాగుతాయని, ప్రభుత్వ ప్రధాన నిర్ణయాల్లో పార్టీ పాత్ర కూడా ఉంటుందని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కపై బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని ఆరోపించారు. నామినేటెడ్ పదవుల విషయంలో సమర్థులకే అవకాశం కల్పిస్తామని, రాబోయే చైర్మన్ పదవుల్లో పాతవారికి 60 శాతం, కొత్తవారికి 40 శాతం ప్రాధాన్యం ఇచ్చేలా చూస్తామని వెల్లడించారు.

## సంపాదకీయం



# దేశవిభజన ఒక చీకటి అధ్యాయం!

స్వాతంత్ర్యం తెచ్చామని కాంగ్రెస్ నేతలు ఇప్పటికీ చంకలు గుద్దుకుంటుంటారు. స్వాతంత్ర్య పోరాటంలో తామే పాల్గొన్నామన్న భావన వ్యాప్తి చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనుకుంటారు. నిజానికి ఎందరో మహానుభావులు ఉద్యమించారు. లక్షల మంది అసువులు బాసారు. అన్నింటికి మించి కాంగ్రెస్ చేసిన దుర్మార్గం కారణంగా దేశం రెండు ముక్కలయ్యింది. లక్షలాది మంది శవాల మీద జెండా ఎగరేశారు. ఓ రకంగా ఆగస్ట్ 14 , 1947 కాళరాత్రి అని చెప్పకతప్పదు. 1947 ఆగస్టు 14 ఉదయం. ఒకవైపు కరాచీలో పాక్ అనే కొత్త దేశం పురుడుపోసుకుంటోందన్న సంబరాలు, మరోవైపు ఢిల్లీలో దశాబ్దాల పారతంత్రం వీడి స్వాతంత్ర్యపు వెలుగులు విరజిమ్మబోతున్నాయన్న సంబరం..కానీ, పంజాబ్, బెంగాల్‌లలోని లక్షలాది ఇళ్లలో మాత్రం హర్షాతిరేకాలు లేవు.. కేవలం కంటిమీద కునుకు లేని భయం, గుండెల్ని పిండేసే అనిశ్చితి మాత్రమే అక్కడి ప్రజల్లో కనిపించింది. దానికి కారణం తెల్లారితే తమ ఊరు, తమ ఇల్లు ఏ దేశంలో ఉంటాయో అక్కడ ఎవరికీ తెలియని దుర్భరమైన పరిస్థితి. సరిహద్దులను నిర్ణయించే బాధ్యతను బ్రిటీష్ న్యాయవాది జాన్ రెడ్‌క్లిఫ్‌కు అప్పగించినప్పటికీ, ఆయన గీసిన ఆ వినాశకరమైన గీత ఆగస్టు 14న బయటకు రాలేదు. ఆ తుది నిర్ణయాన్ని ఆగస్టు 17 వరకు దాచిపెట్టారు. అంటే అర్ధరాత్రి రెండు దేశాలు స్వతంత్రంగా మారినప్పటికీ, వేలాది కుటుంబాలకు తమ సొంత ఇల్లు భారత్‌లో ఉందో, పాకిస్థాన్‌లో ఉందో తెలియని ఒక విచిత్రమైన, విషాదకరమైన పరిస్థితిలో7 ఉండిపోయారు. విభజన ప్రకటన ఇరు ప్రాంతాల ప్రజల్లో తీవ్ర ఆవేదన, ఆందోళన నింపింది. అందుకే ఆగస్టు 14 భారత దేశానికి ఒక చీకటి రోజుగా పరిగణిస్తారు. ఇది స్వాతంత్ర్యం తీసుకుని వచ్చిన దానికన్నా పెను విషాదాన్ని నింపింది. ఒక రకంగా చెప్పాలంటే 1947 ఆగస్టు 14 రాత్రి కేవలం భారత్‌ను చీల్చడానికి ఉద్దేశించిన రోజుగానే చూడాలి. దేశాలను విభజించడానికి గీసిన గీతకు ఆనాటి పెద్దలు అంగీకారం తెలపడం నేటికీ జీర్ణించుకోలేని చరిత్రగా మిగిపోతుంది. విభజనకు గీసిన ఒక గీత మధ్య అసలు మనిషి ఎక్కడ నిలబడ్డాడనేది అంతుచిక్కని ప్రశ్నగా మిగిలి పోయింది. ఈ చారిత్రక ఘట్టాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా ఆగస్టు 14న కరాచీలో ఏం జరిగిందో చూడాలి. ఆ రోజు ఉదయం 9 గంటలకు సింధ్ అసెంబ్లీ భవనం బయట ఉత్సాహంతో జనం కిక్కిరిసిపోయారు. మహమ్మద్ అలీ జిన్నా, లార్డ్ మౌంట్‌బాటన్ ఒకే రాచరికపు బగ్గీలో అక్కడికి చేరుకున్నారు. కరాచీలోని రాజ్యాంగ పరిషత్ ప్రత్యేక సమావేశంలో అధికార మార్పిడి పక్రియ అధికారికంగా ముగిసింది. అయితే, మౌంట్‌బాటన్‌కు అక్కడ ఎక్కువ సేపు గడిపే వ్యవధి లేదు. మధ్యాహ్నం 2 గంటలకే ఆయన ఢిల్లీకి పయనమయ్యారు. ఎందుకంటే అదే రోజు అర్ధరాత్రి భారత్ స్వాతంత్య వేడుకల్లో ఆయన పాల్గొనాల్సి ఉంది. ఇక, కరాచీలో సంబరాలు ముగిసి ఢిల్లీలో అర్ధరాత్రి వేడుకలకు వేదిక సిద్ధమవుతుంటే, పంజాబ్‌లో మాత్రం సరిహద్దు రక్తసిక్తమయ్యింది. విభజన వార్త కేవలం పత్రికలకే పరిమితం కాకుండా ప్రజల గుమ్మాల ముందుకు వచ్చింది. హిందువులు, ముస్లింలు, సిక్కులు తమ ఇళ్లను వదిలి వెళ్లాలో వద్దో తెలియక కొట్టుమిట్టాడారు. పంజాబ్‌లో రైళ్లు నడుస్తున్నాయి, కానీ అవి కేవలం ప్రయాణికులను మాత్రమే కాక, ముక్కలైన జీవితాలను మోసుకెళ్తున్నాయి. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 8 మధ్య దాదాపు ఏడు లక్షల మంది శరణార్థులు రైళ్ల ద్వారా సరిహద్దులు దాటారని అంచనా. కానీ, అసలు భయానక దృశ్యం ఆగస్టు 17 తర్వాత మొదలైంది. రెడ్‌క్లిఫ్ లైన్ బహిర్గతమయ్యాక, తమ ఊరు పరాయి దేశంలోకి వెళ్లిపోయిందని తెలిసిన దాదాపు 1.5 కోట్ల మంది ప్రజలు కాలినడకన, బస్సుల్లో, రైళ్లలో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని సరిహద్దులు దాటడం ప్రారంభించారు. మార్గమధ్యంలో శరణార్థుల కాఫిలాలు, రైళ్లపై దాడులు జరిగాయి. దహనమైన, నిశ్శబ్దంగా శవాల దిబ్బగా మారిన రైళ్లు స్టేషన్లకు చేరుకున్నాయి. ఈ హింసలో 5 నుంచి 10 లక్షల మంది లేదా కొన్ని అంచనాల ప్రకారం 15 నుంచి 20 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 75 వేల మంది మహిళలు కిడ్నాప్‌లు, లైంగిక హింసకు గురయ్యారు. దేశమంతా ఒకవైపు పండుగ వాతావరణం, మరోవైపు రక్తపాతంతో అల్లకల్లోలంగా ఉంటే, మహాత్మా గాంధీ మాత్రం ఈ వేడుకలకు చాలా దూరంగా కలకత్తాలోని బెలియాఘటాలో ఉన్న హైదరీ మంజిల్‌లో ఉన్నారు. కలకత్తాలో ఆగస్టు 16-18 మధ్య జరిగిన హింసలో 4,000 మందికి పైగా చనిపోయిన వేళ, గాంధీ అక్కడే ఉండి శాంతి కోసం నిరాహార దీక్షలు చేపట్టారు. బ్రిటిష్ పాలన అధికారికంగా అంతమై, కొత్త పతాకం ఎగిరింది. కానీ, ఆ వెలుగుల వెనుక దట్టమైన చీకటి దాగి ఉంది. ఒకవైపు అధికార మార్పిడి, మరోవైపు కోట్ల మంది నిరాశ్రయుల కాళ్ల నడకలు..శాల దిబ్బలు వంటివన్నీ కళ్లముందు కదలాడాయి. జిన్నా ఎత్తులకు లొంగిపోవడంతో దేశం భారీ మూల్యం చెల్లించుకుంది. గాంధీ, నెహ్రూలు ప్రేక్షకపాత్ర వహించారు. మారణహోమాన్ని ఆపలేక పోయారు. ప్రజలను నడివీధుల్లో నిరాశ్రయులను చేశారు. ఇప్పటికీ అనేక కుటుంబాలు ఆ క్షోభ నుంచి కోలుకోలేదు. స్వాతంత్ర్యం తెచ్చామని ప్రగల్భాలు పలుకుతున్న నేటి కాంగ్రెస్ నేతలు ఆనాటి మారణహోమానికి సమాధానం చెప్పగలరా? ఈ విభజన కేవలం కాంగ్రెస్ లొంగుబాటు తీరు వల్లే అని ప్రపంచానికి తెలియదా? దేశాన్ని ఐక్యంగా ఉంచడంలో విఫలమైన ఆనాటి కాంగ్రెస్ నాయకత్వాన్ని ఏమనాలి? ఇవన్నీ సమాధానం లేని ప్రశ్నలుగానే ఉన్నాయి.

# విద్యార్థులపై చర్యలొద్దు!

## నాకు-వారికి మధ్య బీసీఐ జోక్యమేంటి?

- నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉంది
- నల్సార్ వివాదంపై చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ఘాటు వ్యాఖ్యలు
- ఆదేశాలు వెనక్కి తీసుకున్నామన్న బార్ కౌన్సిల్



**న్యూఢిల్లీ, ఆగస్టు 14 :** నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయ విద్యార్థులపై చర్యలకు సిద్ధమైన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తీరుపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఇది నాకు, విద్యార్థులకు మధ్య ఉన్న విషయం. మా మధ్య జోక్యం చేసుకోవడానికి బార్ కౌన్సిల్ ఎవరు?" అంటూ ప్రశ్నించారు. విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేశారు. నల్సార్ స్నాతకోత్సవానికి చీఫ్ జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడంపై కొందరు విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో వివాదం మొదలైంది. దీనిపై స్పందించిన బార్ కౌన్సిల్.. 2026 బ్యాచ్ విద్యార్థులను తదుపరి ఆదేశాల వరకు న్యాయవాదులుగా నమోదు చేయవద్దని రాష్ట్ర బార్ కౌన్సిళ్లను ఆదేశించింది. విద్యార్థుల నిరసన వెనుక ఎవరున్నారనే అంశంపైనా విచారణ జరపాలని విశ్వవిద్యాలయాన్ని కోరింది. బార్ కౌన్సిల్ నిర్ణయంపై విమర్శలు వెల్లువెత్తడంతో వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం బార్ కౌన్సిల్ తీరుపై తీవ్రంగా స్పందించింది. విద్యార్థులకు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయడంతోపాటు నిరసన తెలిపే హక్కు ఉందని చీఫ్ జస్టిస్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో బార్ కౌన్సిల్ జోక్యం ఏమాత్రం అవసరం లేదన్నారు. అయితే విద్యార్థుల నమోదును నిలిపివేస్తూ ఇచ్చిన ఆదేశాలను ఇప్పటికే ఉపసంహరించుకున్నట్లు బార్ కౌన్సిల్ తరఫు న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు. దీంతో తదుపరి విచారణను సుప్రీంకోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది. నల్సార్ స్నాతకోత్సవానికి చీఫ్ జస్టిస్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ సుమారు 450 మంది విద్యార్థులు విశ్వవిద్యాలయ అధికారులకు లేఖ రాయడంతో ఈ వివాదం మొదలైంది. విద్యార్థుల ఆందోళనలకు సంబంధించిన అంశాల్లో సుప్రీంకోర్టు వైఖరిపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ వారు ఆ లేఖ రాశారు.

# జనగణన-2027కు కేంద్రం రెడీ

- 40 ప్రశ్నలతో జాబితా నోటిఫై
- తొలిసారిగా సమగ్ర కుల గణనకు రంగం సిద్ధం
- 10వ ప్రశ్నలో ఎస్సీ, ఎస్టీ, కుల వివరాలు
- డిజిటల్ విధానంలో జనాభా లెక్కల సేకరణ
- రెండు దశల్లో ప్రక్రియ.. 11,718 కోట్ల వ్యయం



**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** దేశవ్యాప్తంగా చేపట్టనున్న 'జనగణన-2027'పై కేంద్ర హోంశాఖ కీలక నోటిఫికేషన్ విడుదల చేసింది. జనగణన సందర్భంగా పౌరులను అడిగే 40 ప్రశ్నలతో కూడిన జాబితాను రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నోటిఫై చేసింది. స్వాతంత్ర్యం అనంతరం తొలిసారిగా సమగ్ర కుల గణన చేపట్టేందుకు కేంద్రం రంగం సిద్ధం చేసింది. జనగణన ప్రశ్నావళిలో 10వ ప్రశ్నగా ఎస్సీ, ఎస్టీ, కులానికి సంబంధించిన వివరాలను నమోదు చేసేందుకు ప్రత్యేక అవకాశం కల్పించారు. దేశంలో తొలిసారిగా యాప్‌లు, డిజిటల్ సాధనాల ద్వారా జనాభా లెక్కలను సేకరించనున్నారు. పౌరులు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునేందుకు 15 రోజుల పాటు అవకాశం కల్పించనున్నారు. రూ.11,718.24 కోట్ల అంచనా వ్యయంతో జనగణన--2027ను రెండు దశల్లో నిర్వహించనున్నారు. తొలి దశలో 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య గృహాల నమోదు, వసతులకు సంబంధించిన వివరాలను సేకరిస్తారు. రెండో దశలో 2027 ఫిబ్రవరిలో జనాభా, విద్య, ఉపాధి, కులానికి సంబంధించిన వివరాల సేకరణ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. జనగణన సందర్భంగా పౌరులు అందించే వ్యక్తిగత వివరాలకు చట్టపరమైన రక్షణ ఉంటుందని కేంద్రం స్పష్టం చేసింది. జనగణన చట్టం--1948లోని సెక్షన్ 15 ప్రకారం పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని పూర్తిగా గోప్యంగా ఉంచనున్నారు.



# రాహుల్‌కు సుప్రీం ఊరట

## సావర్కర్ వ్యాఖ్యలపై పరువు నష్టం కేసు కొట్టివేత

## లఖ్‌నవూ మెజిస్ట్రేట్ జారీ చేసిన సమన్లు రద్దు

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి సుప్రీం కోర్టులో ఊరట లభించింది. సావర్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఆయనపై నమోదైన క్రిమినల్ కేసును సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ వ్యవహా రంలో రాహుల్‌కు లఖ్‌నవూ మెజిస్ట్రేట్ జారీ చేసిన సమ న్లను కూడా రద్దు చేసింది. భారత్ జోడో యాత్ర సంద ర్భంగా సావర్కర్‌పై రాహుల్ చేసిన వ్యాఖ్యలను అభ్యం తరకరంగా పేర్కొంటూ నృపేంద్ర పాండే న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సెక్షన్ 153ఏ కింద చర్యలు తీసుకోవాలని కోరారు. తొలుత అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పిటిషన్‌ను తిరస్కరించగా, సెషన్స్ కోర్టులో సవాలు చేయడంతో కేసు తిరిగి మెజిస్ట్రేట్‌కు చేరింది. అనంతరం రాహుల్‌కు సమన్లు జారీ అయ్యాయి. వాటిని సవాలు చేస్తూ రాహుల్ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించినప్పటికీ అక్కడ ఊరట లభించలేదు. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సెక్షన్ 153ఏ కింద విచారణ చేపట్టేందుకు అవసరమైన కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వ ముందస్తు అను మతి లేదని పేర్కొన్న సుప్రీంకోర్టు కేసును కొట్టివేసింది. అయితే స్వాతంత్ర్య సమరయోధుల గురించి వ్యాఖ్యలు చేసే సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టు సూచించింది.

# విభజన గాయాలు.. ఎన్నో జీవితాలు ఛిద్రం

## దేశ విభజనతో కుటుంబాలు చెల్లాచెదురయ్యాయి

## భయానక పరిస్థితుల నుంచి జీవితాలను పునర్నిర్మించుకున్నారు

## బాధితుల ధైర్యం, పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

## 'పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డే' సందర్భంగా ప్రధాని మోదీ





**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** దేశ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. విభజన కారణంగా ప్రియమైన వారిని కోల్పోయి, తీవ్ర కష్టాలను ఎదుర్కొన్నప్పటికీ జీవితాలను తిరిగి నిర్మించుకున్న బాధితుల ధైర్యం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. 'పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డే' సందర్భంగా దేశ విభజన బాధితులను మోదీ స్మరించుకున్నారు. దేశ విభజన, సామూహిక వలసలు, అనంతరం జరిగిన హింసలో ప్రాణాలు కోల్పోయిన వారి జ్ఞాపకార్థం కేంద్ర ప్రభుత్వం 2021 నుంచి ప్రతి ఏటా ఆగస్టు 14న ఈ దినాన్ని పాటిస్తోంది. దేశ విభజనతో ఎన్నో కుటుంబాలు చెల్లాచెదురయ్యాయని, లక్షలాది మంది తమ ప్రియమైన వారిని, సొంత ప్రాంతాలను కోల్పోయి అంతులేని బాధను అనుభవించారని మోదీ పేర్కొన్నారు. అంతటి భయానక పరిస్థితులను అధిగమించి జీవితాలను పునర్నిర్మించుకోవడంతోపాటు ప్రతికూలతలను విజయంగా మార్చుకుని దేశ ప్రగతికి దోహదపడ్డారని తెలిపారు. విభజన బాధితుల జీవితాలు సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని పరిరక్షించాల్సిన బాధ్యతను గుర్తుచేస్తాయని మోదీ పేర్కొన్నారు. వికసిత భారత్ నిర్మాణానికి సమష్టిగా కృషి చేసేందుకు వారి పోరాట స్ఫూర్తి దేశ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు.



# మా సహనాన్ని బలహీనతగా భావించొద్దు

## అవసరమైతే ఎంతటి ముప్పునైనా ఎదుర్కొంటాం

## ఉగ్రవాదంపై దీటుగా స్పందిస్తామనే సందేశమిచ్చాం

## ఆపరేషన్ సిందూర్ లక్ష్యాలు ముందే నిర్దేశించుకున్నాం

## జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ హెచ్చరిక

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** భారత సహనాన్ని బలహీనతగా భావిస్తే పొరపాటేనని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ హెచ్చరించారు. దేశ భద్రత విషయంలో అవసరమైతే ఎంతటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్‌పై రూపొందించిన డాక్యుమెంటరీ సిరీస్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన లక్ష్యాలను ముందుగానే స్పష్టంగా నిర్ణయించుకున్నామని డోభాల్ తెలిపారు. దాడి వెనుక ఉన్న ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడమే ప్రధాన లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఉగ్రవాద చర్యలను భారత్ ఏమాత్రం సహించదని, అవసరమైతే దీటుగా స్పందిస్తుందనే స్పష్టమైన సందేశాన్ని ఈ ఆపరేషన్ ద్వారా ఇచ్చామని పేర్కొన్నారు. "భారతదేశ సహనాన్ని బలహీనతగా భావించే పొరపాటు చేయొద్దు. దేశ ప్రయోజనాలు, భద్రత విషయంలో అవసరమైతే భారత్ ఎంతటి ముప్పునైనా ఎదుర్కోగలదు" అని డోభాల్ స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన పరిణామాలు, వ్యూహాలు, క్షేత్రస్థాయి అనుభవాలను డోభాల్‌తోపాటు ఆపరేషన్‌లో కీలకంగా వ్యవహరించిన పలువురు అధికారులు డాక్యుమెంటరీలో వివరించారు. శనివారం రాత్రి 9 గంటలకు ఈ డాక్యుమెంటరీ ప్రసారం కానుంది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టి ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. అనంతరం భారత్--పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, చివరకు కాల్పుల విరమణతో పరిసితి సదుమణిగింది.

# స్వతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన

## జిల్లా కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట, ఆగస్టు,14:**
నారాయణపేట: స్వతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక శుక్రవారం జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీను, అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ హుల్ హక్ తదితర అధికారులతో కలిసి వేడుకల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.స్వతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రజలు, విద్యార్థులు, అధికారులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా



చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యార్థులు మరియు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, స్టాల్స్ ఏర్పాటు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.వేడుకల సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు, వీఐపీలు, ప్రజలు మరియు విద్యార్థుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమన్వయంతో చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు. కార్యక్రమం సజావుగా జరిగేలా ప్రతి శాఖ తనకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ పేర్కొన్నారు.అదనపు ఎస్పీ ఎం.డీ రియాజ్ హుల్ హక్ పోలీస్ శాఖ తరఫున చేపట్టిన భద్రతా ఏర్పాట్లను వివరించారు. పరేడ్, ప్రజల రాకపోకలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై సంబంధిత పోలీస్ అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో, తహసీల్దార్, టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# షాబాద్ లో MRPS నియోజకవర్గ స్థాయి సమావేశం

- మత దురహంకారం, కుల వివక్షత లేని సమాజం కోసం పోరాడుతాం -రాగల్ల ఉపేందర్
- సెప్టెంబర్ 9న వరంగల్ లో MRPS మండల కమిటీల జాతీయ సదస్సు



**షాబాద్: ఆగస్టు 14:**
చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండల కేంద్రంలో MRPS మరియు అనుబంధ విభాగాల నియోజకవర్గ స్థాయి సమావేశం మల్కి ప్రవీణ్ మాదిగ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా ఇంచార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ మత దురహంకారం, కుల వివక్షత, సాంఘిక అసమానతలు లేని సమాజం కోసం MRPS పోరాడుతుందని అన్నారు. మూడు దశాబ్దాలుగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సి వర్గీకరణతో పాటు పేద వర్గాల సంక్షేమం కోసం ఉద్యమాలు చేసినట్లు తెలిపారు.కుల వ్యవస్థను రూపుమాపి, పూలే, అంబేద్కర్, జగజీవన్ రామ్, కాన్షిరామ్ ల ఆశయాలతో పీడిత వర్గాల విముక్తి కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలో నూతన కమిటీలను ఏర్పాటు చేసి యువతను ఉద్యమంలోకి తీసుకురావాలని సూచించారు.సెప్టెంబర్ 9న వరంగల్ లో MRPS మండల కమిటీల జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో షాబాద్ మండల నాయకులు విశ్వం మాదిగ, జంగయ్య మాదిగ, మల్కి ప్రవీణ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# అవయవదానం.. మరొకరికి జీవనదానం

- ఎన్టీఆర్ మహిళా కళాశాలలో అవగాహన సదస్సు

**మహబూబ్‌నగర్, ఆగస్టు 14:,:**
అవయవదానం ద్వారా మరణానంతరం కూడా ఇతరులకు కొత్త జీవితాన్ని అందించవచ్చని అఖిల భారత అవయవదాతల సంఘం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లయన్ డాక్టర్ వి. నటరాజ్ అన్నారు. మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా నటరాజ్ మాట్లాడుతూ, తమ సంఘం ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఎస్‌వీఎస్ మెడికల్ కళాశాలకు ఇప్పటివరకు 273 కళ్లను, 18 మృతదేహాలను దానం చేసినట్లు తెలిపారు. అవయవదానం ఒక కుటుంబానికి కొత్త ఆశను, జీవితాన్ని అందించే మహాదానమన్నారు.ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రామ్మోహన్ అవయవదానం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అమీన ముంతాజ్ జహాన్ మాట్లాడుతూ, అవయవదానంపై ఉన్న అపోహలను తొలగించి సమాజంలో అవగాహన పెంచాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అవయవదాతల సంఘం ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# నిరాధార ఫిర్యాదులు, తప్పుడు ప్రచారాన్ని ఉపేక్షించం

- కలెక్టర్ కోయ శ్రీహర్ష
- అధికారులను అప్రతిష్ఠపాలు చేసేలా ఫిర్యాదు చేసిన వ్యక్తికి లోకాయుక్త రూ.10 వేల జరిమానా
- తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తే చట్టప్రకారం చర్యలు



**పెద్దపల్లి, ఆగస్టు 14:** అధికారులపై నిరాధార ఆరోపణలు చేస్తూ తప్పుడు ప్రచారం చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష హెచ్చరించారు.పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌కు చెందిన బొబ్బిలి సత్యనారాయణ, గ్రామపంచాయతీ పరిధిలో ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి సరైన అనుమతులు లేవంటూ 2023 జనవరి 2న లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి నివేదికను లోకాయుక్తకు సమర్పించారని పేర్కొన్నారు.అధికారుల నివేదికను పరిశీలించిన లోకాయుక్త, సత్యనారాయణ ఫిర్యాదు నిరాధారమైనదిగా, వేధింపులకు ఉద్దేశించినదిగా పేర్కొంటూ 2025 డిసెంబర్ 22న కొట్టివేసినట్లు తెలిపారు. లోకాయుక్తతో పాటు ప్రభుత్వ అధికారుల విలువైన సమయాన్ని వృథా చేసినందుకు తెలంగాణ లోకాయుక్త చట్టంలోని సెక్షన్ 13-A కింద రూ.10 వేల జరిమానా విధించినట్లు కలెక్టర్ వెల్లడించారు.లోకాయుక్త ఆదేశాల మేరకు జరిమానా మొత్తాన్ని రెవెన్యూ రికవరీ చట్టం కింద వసూలు చేసి ముఖ్యమంత్రి సహాయనిధిలో జమ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ప్రజా సమస్యలపై వాస్తవాధారాలతో చేసే ఫిర్యాదులను ప్రభుత్వం స్వాగతిస్తుందని, అయితే వ్యక్తిగత ప్రయోజనాల కోసం అధికారులను అప్రతిష్ఠపాలు చేసేలా నిరాధార ఆరోపణలు చేయడం, తప్పుడు సమాచారం ప్రచారం చేయడం సరికాదని కలెక్టర్ పేర్కొన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# జిల్లాలో ఎరువులకు కొరత లేదు

## జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 14:** జిల్లాలో పంటల సాగుకు అవసరమైన ఎరువులకు ఎలాంటి కొరత లేదని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఎరువుల సరఫరా, నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు.పంటల అవసరాలకు అనుగుణంగా అన్ని రకాల ఎరువులను జిల్లాలో తగినంత నిల్వ ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలని, వ్యవసాయ శాఖ అధికారులు తమ పరిధిలోని ఎరువుల దుకాణాలను నిరంతరం తనిఖీ చేయాలని సూచించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, సహకార శాఖ అధికారి రామకృష్ణ, మార్క్‌ఫెడ్ డీఎం హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో లోటుపాట్లకు తావివ్వొద్దు

- అధికారులు అప్రమత్తంగా బాధ్యతలు నిర్వర్తించాలి: ములుగు కలెక్టర్ హేమంత్ సహదేవరావు

**ములుగు, ఆగస్టు 14::** ఈ నెల 16న ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా అధికారులు అప్రమత్తంగా ఉంటూ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు.శుక్రవారం జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. మేడారం వనదేవతల ప్రాంగణం, నూతన కలెక్టరేట్, పైలాన్, గట్టమ్మ ఆలయం తదితర ప్రాంతాల్లో పటిష్ట భద్రత కల్పించాలని సూచించారు.మేడారంలో వనదేవతల దర్శనం, తులాభారం, పించన్ల పంపిణీతో పాటు నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవం, బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వొద్దని స్పష్టం చేశారు.సమావేశంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జీ, సంపత్ రావు, ఆర్డీవో కృష్ణవేణి, డీఆర్వో



రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అట్రాసిటీస్ బాధితులకు సకాలంలో పరిహారం అందించాలి

## కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి, ఆగస్టు 14:** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ కేసుల్లో బాధితులకు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం సకాలంలో పరిహారం, ఇతర సహాయాలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కేసుల నమోదు, దర్యాప్తు, పరిహారం చెల్లింపు పురోగతిని సమీక్షించారు. ప్రతి నెల 'సివిల్ రైట్స్ డే' నిర్వహించి ఎస్సీ, ఎస్టీల హక్కులపై అవగాహన కల్పించడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు, పోలీసు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# జీ.జీ.హెచ్‌లో అస్తవ్యస్త పరిస్థితులపై కలెక్టర్ ఆగ్రహం

**నిజామాబాద్, ఆగస్టు 14:** నిజామాబాద్ ప్రభుత్వ జిల్లా జనరల్ ఆసుపత్రిని కలెక్టర్ భవేష్ మిశ్రా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాల్లో డ్రైనేజీ పైప్‌లైన్ల లీకేజీలు, వ్యర్థ జలాల నిల్వ, చెత్తాచెదారం, దుర్గంధం వంటి సమస్యలను గుర్తించి అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.పారిశుధ్య సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ఆసుపత్రి



లోపల, బయట ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఓపెన్ డ్రైనేజీలపై పైకప్పులు ఏర్పాటు చేయడంతో పాటు రహదారిపై గుంతలకు మరమ్మతులు చేపట్టాలని, వృథా నిర్మాణ సామగ్రిని తొలగించాలని సూచించారు. కుక్కలు, పశువులు ఆసుపత్రి ఆవరణలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ వి. భుజంగరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాములు తదితరులు ఉన్నారు.

# మండల స్థాయి ప్రజావాణిని సమర్థవంతంగా నిర్వహించాలి

## జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్

**మంచిర్యాల, ఆగస్టు 14::** ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్ అధికారులను ఆదేశించారు.నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో శుక్రవారం జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ నిర్వహించారు. ప్రజల నుంచి అందే సమస్యలు, ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంబంధిత శాఖలకు పంపించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.డేటా ఎంట్రీ, ఫిర్యాదుల నమోదు, రసీదు జారీ తదితర సాంకేతిక అంశాలపై శిక్షణ అందించారు. ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించడమే ప్రజావాణి ప్రధాన లక్ష్యమని మోతిరామ్ తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆయుష్ హౌస్ సర్జన్లు, పీజీల స్టైపెండ్ పెంచాలి

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతి

**ఉప్పల్ ఆగస్టు14:**
తెలంగాణ వ్యాప్తంగా స్టైపెండ్ పెంపు కోరుతూ AYUSH హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థులు నిరవధిక సమ్మె చేపట్టిన నేపథ్యంలో JSPS హోమియోపతి కళాశాల పీజీలు, ఇంటర్న్‌లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్టైపెండ్ పెంపు సమస్యను వెంటనే పరిష్కరించి, ఇతర వైద్య విభాగాల విద్యార్థులతో సమానంగా న్యాయమైన స్టైపెండ్ అందించాలని కోరారు. ఇందుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.తమకు జరుగుతున్న అసమానతకు ప్రభుత్వం ముగింపు పలకాలని, స్టైపెండ్ పెంపు అమలయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని విద్యార్థులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు గంధం నాగేశ్వర్‌రావు, శివగౌడ్, పార్టీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



చురకలు

శనివారం15.08.2026

# శిశుగృహంలోని నాలుగు నెలల బాబు దత్తత



- పెద్దపల్లి దంపతులకు బాబును అప్పగించిన జిల్లా సంక్షేమ అధికారి

**కరీంనగర్, ఆగస్టు 14:** కరీంనగర్ శిశుగృహంలో సంరక్షణ పొందుతున్న నాలుగు నెలల బాబును పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన దంపతులకు శుక్రవారం చట్టబద్ధ దత్తత ప్రక్రియ ద్వారా జిల్లా సంక్షేమ అధికారి ఎం. సరస్వతి అప్పగించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సంతానం లేని దంపతులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం చట్టబద్ధమైన విధానంలోనే పిల్లలను దత్తత తీసుకోవాలని సూచించారు. దత్తతకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం జిల్లా పరిషత్‌లోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యుడు కళింగ శేఖర్, బి. రాధ, డీసీపీఓ పర్వీన్, శిశుగృహ ఇన్‌చార్జి అపూర్వ, సూపరింటెండెంట్ నర్మద, సీడీపీఓలు కవిత, శ్రీలత, సుగుణ, నర్సింగరాణి, జె. తిరుపతి, సంపత్, మునిగంటి రాజ్‌కుమార్, సాదినేని రమేష్, మహేష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# అమిలికుంట గ్రామంలో పోలాలను సందర్శించిన వ్యవసాధికారులు



**గుండుమాల్ మండలం, ఆగస్టు,14:**
గుండుమల్ మండలంలోని అమిలీకుంట గ్రామంలో పొలాలను సందర్శించిన వ్యవసాయం అధికారులు. ప్రస్తుత ఎల్నినో దృష్ట్యా వరిని తగ్గించి రైతు రాజేంద్ర బాబు బత్తాయి తోటలో అంతర పంటలుగా మల్చింగ్ షీట్లు మరియు డ్రిప్ ఇరిగేషన్‌ను ఉపయోగిస్తూ పచ్చిమిర్చి, టమోటో, క్యాప్సికమ్ పంటలను సాగు చేస్తున్నారు.వ్యవసాయ శాఖ మార్గదర్శకత్వంలో జీవామృతం, కషాయాలు ఉపయోగిస్తూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తున్నారు. అలాగే, వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై పంపిణీ చేసిన విత్తనాలతో పచ్చిరొట్ట ఎరువు జిలగా పంటను కూడా సాగు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కోస్గి ఏ.డీ. ఏ బి.రామకృష్ణ ,ఏఇఓ లు కే. తిరుపతి, జె. నరేందర్,పాల్గొన్నారు

# వరుస చై[illegible] కేసులు ఛేదించిన భద్రాద్రి పోలీసులు

**8 మంది అరెస్ట్.. రూ.26 లక్షల సొత్తు స్వాధీనం**



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 14:** జిల్లాలో వరుస చైన్ స్నాచింగ్, చోరీ కేసులను పోలీసులు ఛేదించి ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు 150 గ్రాముల బరువున్న ఆరు బంగారు గొలుసులు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.26 లక్షలని ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు.ప్రధాన నిందితుడు సున్నం నాగేంద్రబాబు తన సహచరులతో కలిసి రాత్రివేళ ఇళ్ల బయట నిద్రిస్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకుని గొలుసులు చోరీ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అతనిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 83 దొంగతనం కేసులు ఉన్నట్లు తెలిపారు. ఈ ముఠాకు సంబంధించి 10 కేసులను ఛేదించగా, మరో నిందితుడు తమ్మిశెట్టి బాలవీరస్వామి పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

# ప్రభుత్వ ఐటీఐలో 17న అప్రెంటిస్ షిప్ మేళా

**మహబూబాబాద్, ఆగస్టు 14:**
మహబూబాబాద్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 17న ఉదయం 11 గంటలకు ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బి. ఓంకార్ తెలిపారు.మేళాలో ఆస్ట్రా మైక్రోవేవ్, ష్నైడర్ ఎలక్ట్రిక్, ఫెనెస్టా, పిట్టి క్లయింట్ కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.14,500 నుంచి రూ.18,000 వరకు స్టైపెండ్‌తో పాటు ఉచిత భోజనం, రవాణా సౌకర్యం కల్పిస్తారని వెల్లడించారు.ఆసక్తిగల అభ్యర్థులు అప్రెంటిస్‌షిప్ ఇండియా పోర్టల్‌లో నమోదు చేసుకుని, ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు, ఫొటోలతో మేళాకు హాజరుకావాలని సూచించారు.

# చేయూత పెన్షన్‌కు నూతన దరఖాస్తుల స్వీకరణ

- అర్హులైన వారు ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకోవాలి
- ఆలేరు మున్సిపల్ చైర్‌పర్సన్ బిజన బాలమణి భాస్కర్




**ఆలేరు, ఆగస్టు 14::** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చేయూత సామాజిక భద్రత పెన్షన్ పథకానికి నూతన దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైనట్లు ఆలేరు మున్సిపల్ చైర్‌పర్సన్ బిజన బాలమణి భాస్కర్ తెలిపారు. ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటివరకు పెన్షన్ పొందని, అర్హత కలిగిన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో చేయూత పెన్షన్ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా మున్సిపాలిటీ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో పెన్షన్ పొందని అర్హులైన వారు ఆగస్టు 31వ తేదీలోగా ఆలేరు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని బిజన బాలమణి భాస్కర్ సూచించారు. గడువు సమీపిస్తున్నందున అర్హులు ఆలస్యం చేయకుండా అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వితంతు పెన్షన్ కోసం నూతన అప్లికేషన్ ఫారంతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్, భర్త మరణ ధృవపత్రం, భర్త ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్, ఒక ఫొటో సమర్పించాల్సి ఉంటుందని,దివ్యాంగుల పెన్షన్ కోసం నూతన అప్లికేషన్ ఫారం, ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్, సదరం సర్టిఫికెట్ జిరాక్స్, ఫోన్ నంబర్, ఒక ఫొటో సమర్పించాలని పేర్కొన్నారు. ఒంటరి మహిళల పెన్షన్ కోసం నూతన అప్లికేషన్ ఫారం, ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్, సంబంధిత ధృవపత్రం, కుల ధృవపత్రం జిరాక్స్, ఆధార్ ధృవపత్రం జిరాక్స్, ఫోన్ నంబర్, ఒక ఫొటో తదితర అవసరమైన పత్రాలను సమర్పించాలని చైర్‌పర్సన్ సూచించారు. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందేలా మున్సిపాలిటీ సహకరిస్తుందని బిజన బాలమణి భాస్కర్ తెలిపారు. అర్హులైన వారు ఆగస్టు 31లోగా దరఖాస్తులు సమర్పించి చేయూత పెన్షన్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ

**బొంరస్ పేట మండలం, ఆగస్టు,14:**
బొంరాస్ పెట్ మండల పరిధిలోని టేకులగడ్డ తండా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 15 ఆగస్టు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ పాలనాధికారి మరియు సర్పంచ్ చేతుల మీదుగా పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందజేశారు. విద్యార్థులు ఏకరూప దుస్తులు అందుకోవడంతో ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌరారం గోపాల్, వివో ఏ పాండు పాండు నాయక్ ఏజెన్సీ సిబ్బంది జెమినీ భాయ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమానికి గ్రామ ప్రజలు ఎల్లప్పుడూ సహకరిస్తారని ఈ సందర్భంగా తెలిపారు.






# కోరుట్ల మున్సిపాలిటీలో ప్రజా సేవలపై ప్రత్యేక దృష్టి

- అధికారులతో అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ సమీక్ష

**జగిత్యాల/కోరుట్ల, ఆగస్టు 14:**
కోరుట్ల పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ మున్సిపాలిటీలోని వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులకు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్యం, డ్రైనేజీ, వర్షపు నీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా ప్రభుత్వ సేవలను పారదర్శకంగా, వేగంగా అందించాలని అధికారులకు సూచించారు.సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వి. రాఘవేంద్రతో పాటు వివిధ విభాగాల అధికారులు, వార్డు



# జిల్లాలో 1,39,116 స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేయాలి

- అధికారులకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాలు

**భూపాల పల్లి ఆగస్టు14:**
స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లాలో 1,39,116 పీవీసీ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీపై రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందేలా ప్రణాళికాబద్ధంగా పంపిణీ చేపట్టాలని సూచించారు.జిల్లా స్థాయిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటలకు ఐడీఓసీ కార్యాలయంలో ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం అన్ని మండలాల్లో పంపిణీ చేపట్టి, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి , పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఆర్‌పీఎఫ్ ఎస్సై గురుప్రసాద్‌కు ఇండియన్ పోలీస్ మెడల్

- 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విశిష్ట సేవలకు జాతీయ స్థాయి గుర్తింపు




**హైదరాబాద్, ఆగస్టు 14:** దక్షిణ మధ్య రైల్వేకు చెందిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) సబ్ ఇన్‌స్పెక్టర్ నాగరికంటి గురుప్రసాద్‌కు విశిష్ట సేవలకు గాను ఇండియన్ పోలీస్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ లభించింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు.గురుప్రసాద్ 25 ఏళ్లకు పైగా సేవలందించగా, అందులో ఎనిమిదేళ్లకు పైగా స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్‌లో పనిచేశారు. నిఘా సమాచారం సేకరణ, నేరాల నివారణ, ప్రయాణికుల భద్రత, చిన్నారుల రక్షణ, రైల్వే ఆస్తుల నేరాల గుర్తింపు తదితర రంగాల్లో విశేష సేవలు అందించారు.తుని రైలు దహనం ఘటన సమయంలో కీలక నిఘా సమాచారం అందించడంతో పాటు అంతర్రాష్ట్ర ముఠాలను పట్టుకోవడం, టికెట్ అక్రమ దళారులపై చర్యలు, ఆపరేషన్ ముస్కాన్‌లో చురుగ్గా పాల్గొనడం వంటి సేవలు ఆయన ఖాతాలో ఉన్నాయి. 2019లో రైల్వే మంత్రి అవార్డుతో పాటు రూ.లక్ష నగదు బహుమతిని కూడా అందుకున్నారు.ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ గురుప్రసాద్‌ను అభినందించారు. ఈ జాతీయ స్థాయి గుర్తింపు ఆర్‌పీఎఫ్‌తో పాటు మొత్తం దక్షిణ మధ్య రైల్వే జోన్‌కు గర్వకారణమని పేర్కొన్నారు.

# జోగిపేట్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్

- 31 బైక్‌లు, కారు.. రూ.5 వేల విలువైన కలప స్వాధీనం

**ఇచ్చోడ, ఆగస్టు 14::** ప్రజల రక్షణ, భద్రతతో పాటు అసాంఘిక కార్యకలాపాల నియంత్రణే లక్ష్యంగా ఇచ్చోడ మండలం జోగిపేట్ గ్రామంలో శుక్రవారం పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఇచ్చోడ రూరల్ సీఐ సీహెచ్ రమేష్ ఆధ్వర్యంలో ఉదయం 6 నుంచి 9 గంటల వరకు 50 మంది పోలీసు సిబ్బంది గ్రామంలో తనిఖీలు చేపట్టారు.సరైన ధ్రువపత్రాలు లేని 31 ద్విచక్ర వాహనాలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. ఐదు వాహనాలపై చట్టపరమైన చర్యలు చేపట్టారు. అలాగే సుమారు రూ.5 వేల విలువైన 10 కలప దుంగలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి, మాదకద్రవ్యాలు, దొంగతనాలు, దోపిడీలకు దూరంగా ఉండాలని సూచించారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలతో తిరగవద్దని, అనుమానాస్పద వాహనాలను కొనుగోలు చేయవద్దని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ఉంటే 8712659944 నంబర్‌కు వాట్సాప్ ద్వారా తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఇచ్చోడ ఎస్‌హెచ్‌ఓ కె. నరేష్ కుమార్, ఎస్‌ఐలు శ్రీకాంత్, విక్రమ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి విద్యార్థిని ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలి





**జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక.**

**ధన్వాడ మండలం,ఆగస్టు,14:** నారాయణపేట జిల్లా ధన్వాడ మండలంలోని కొండాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ప్రియాంక శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, మైదానం, మరుగుదొడ్లను పరిశీలించి మైదానంలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని సర్పంచ్‌ను ఆదేశించారు.వినియోగంలో లేని మూత్రశాలను మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని, 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించుకోవాలని సూచించారు.పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ గతేడాది 100 శాతం ఉత్తీర్ణత సాధించిన వివరాలను తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థిని కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, మహిళా సాధికారతకు విద్య ఎంతో కీలకమని సూచించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, మెనూ ప్రకారం అన్నం, వెజిటబుల్ కర్రీ, గుడ్డు, సాంబారు అందించకుండా కేవలం అన్నం , సాంబారు మాత్రమే చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ అమలు చేయించని మెస్ ఇన్‌చార్జ్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

**నీట్ , జే ఈ ఈ విద్యార్థులకు దిశానిర్దేశం**

అంతకుముందు గిరిజన గురుకులాన్ని కలెక్టర్ తనిఖీ చేసి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నీట్, జే ఈ ఈ మెయిన్స్ పరీక్షలపై అవగాహన కల్పించారు. ప్రతిరోజూ నిన్నటి కంటే మెరుగ్గా చదవాలని, కష్టమైన సబ్జెక్టులను వాయిదా వేయకుండా ముందుగా సాధన చేయాలని సూచించారు.రోజువారీ చదువుకు టైమ్‌టేబుల్ రూపొందించుకుని క్రమశిక్షణతో చదవాలని, ఒక్క రోజును కూడా వృథా చేయకుండా పోటీ పరీక్షలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని కలెక్టర్ ప్రియాంక సూచించారు.కలెక్టర్ వెంట జిల్లా అధికారులు, గురుకుల ప్రిన్సిపాల్ ఎం. రాజారాం, అధ్యాపకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# జీరో ఫాటాలిటీ కారిడార్‌గా వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారి

- **ప్రమాదకర ప్రాంతాల్లో భద్రతా పనులు వేగవంతం చేయాలి: వరంగల్ సీపీ శ్వేత**



**జనగామ, ఆగస్టు 14,:** వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై ప్రమాదాలను తగ్గించి, జీరో ఫాటాలిటీ కారిడార్‌గా తీర్చిదిద్దేందుకు భద్రతా చర్యలను వేగవంతం చేయాలని వరంగల్ సీపీ శ్వేత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి శుక్రవారం జనగామ కలెక్టరేట్‌లో జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు.జిల్లా పరిధిలోని సుమారు 46 కిలోమీటర్ల జాతీయ రహదారిపై గుర్తించిన ప్రమాదకర ప్రాంతాల్లో మీడియన్ ఓపెనింగ్స్ మూసివేత, రంబుల్ స్ట్రిప్స్, హెచ్చరిక సూచికలు, వీధి దీపాలు, క్రాష్ బారియర్లు, రోడ్డు మార్కింగ్స్, ఫుట్ ఓవర్ బ్రిడ్జీల వంటి పనులను త్వరగా పూర్తి చేయాలని సీపీ సూచించారు. పల్లగుట్ట, మీదిగొండ, గోవర్ధనగిరి, రాఘవాపూర్ జంక్షన్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ప్రతి బ్లాక్‌స్పాట్‌పై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు సురక్షిత ప్రయాణం కల్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీసీపీ రాజ మహేంద్ర నాయక్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కాజీపేట ఆర్‌ఓబీ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

- **పనుల జాప్యంలో అలసత్వాన్ని సహించేది లేదు: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**





**హనుమకొండ, ఆగస్టు 14:** కాజీపేటలో నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు.శుక్రవారం ఆర్‌ఓబీ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, పనుల పురోగతిపై ఆరా తీశారు. నిర్మాణంలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు.పనుల జాప్యంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని కాంట్రాక్టర్లను హెచ్చరించారు. అధికారులు నిత్యం పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు.ఆర్అండ్‌బీ ఎస్ఈ సురేష్ బాబు పనుల పురోగతిని కలెక్టర్‌కు వివరించారు. ఈఈ దేవిక, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల భద్రతకు సీసీటీవీలు కీలకం

- **మూడు గ్రామాల్లో 35 కెమెరాలు ప్రారంభం — చెప్రాలలో ఉచిత వైద్య శిబిరం**



**ఆదిలాబాద్, ఆగస్టు 14:** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల భద్రతకు సీసీటీవీ నిఘా ఎంతో కీలకమని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చెప్రాల గ్రామంలో 15, సిర్సన్నలో 16, ఎకోరిలో 4 చొప్పున మొత్తం 35 సీసీటీవీ కెమెరాలను గ్రామస్తులతో కలిసి ఆయన ప్రారంభించారు.అంతర్రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో సీసీటీవీల ఏర్పాటు ద్వారా నేరాలను నియంత్రించడంతో పాటు నేరస్థులను త్వరగా గుర్తించేందుకు అవకాశం ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు. గ్రామ భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, కెమెరాల ఏర్పాటుకు సహకరించిన గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులను అభినందించారు.అనంతరం చెప్రాల గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఆదిలాబాద్‌కు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు వైద్య నిపుణులు ఎముకలు, కంటి, దంత, సాధారణ వైద్యం, స్త్రీ వైద్య విభాగాల్లో పరీక్షలు నిర్వహించి ఉచిత చికిత్స అందించారు. కంటి సమస్యలున్న 20

# నడికుడలో నూతన ప్రెస్ క్లబ్ ప్రారంభం...

- **ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర కీలకం... డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**



**హన్మకొండ/నడికుడ, ఆగస్టు 14 : :** హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గంలోని నడికుడ మండల కేంద్రంలో నూతన ప్రెస్ క్లబ్ ప్రారంభోత్సవం, నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం స్థానిక మారుతి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన ప్రెస్ క్లబ్‌ను ప్రారంభించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులతో పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో నాలుగో స్తంభంగా భావించే జర్నలిజం ఎంతో పవిత్రమైనదని అన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో, ప్రజలకు–ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలవడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.నడికుడ మండలంలోని జర్నలిస్టులందరూ ఐక్యంగా ముందుకు వచ్చి ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. నూతన కార్యవర్గ సభ్యులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ప్రజల పక్షాన నిలిచి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని సూచించారు.అనంతరం ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడు, కార్యదర్శితో పాటు కార్యవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. నూతన బాధ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక మండల కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ మండలాల ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, సీనియర్ జర్నలిస్టులు, స్థానిక పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్ నాటికి వంద పడకల ఆసుపత్రి పూర్తి చేయాలి

**కలెక్టర్ అంకిత్**



**ఇల్లందు, ఆగస్టు 14:** ఇల్లందులో రూ.37.50 కోట్లతో నిర్మిస్తున్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన, పనులు వేగవంతం చేయడంతో పాటు నాణ్యతలో ఎలాంటి రాజీ పడవద్దని స్పష్టం చేశారు.అనంతరం ఇల్లందు చెరువును పరిశీలించిన కలెక్టర్, అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ పొదుపుగా వినియోగించాలని సూచించారు. సాగునీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వరి సాగును తగ్గించి పెసర వంటి తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.సుందిమళ్ల టీజీడబ్ల్యూఆర్ఎస్ పాఠశాల, కళాశాలను తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధన, వసతి, భోజన సదుపాయాలను పరిశీలించారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. భవనంలోని లీకేజీ సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

# అప్పాయిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా మ్యాతరి సంగప్ప

**కొడంగల్ మండలం, ఆగస్టు,14:**



కొడంగల్ మండలం అప్పాయిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులు గా మ్యాతరి సంగప్ప ను ఉపాధ్యక్షులుగా బాలరాజ్ గౌడ్ గిరిమి కిష్టప్ప ప్రధాన కార్యదర్శిగా నర్సప్ప సాయిలు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్న గ్రామ కమిటీ జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు నర్సిరెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ మండల అధ్యక్షులు సంజీవరెడ్డి మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో నాయకులు సర్పంచ్ బొడ్రాయి వెంకటయ్య ఉప సర్పంచ్ పకీరప్ప గోకుల్ సింగ్ దత్తు సింగ్ బాల్రాజ్ కాశయ్య గౌడ్ కిషన్ సింగ్ బందాయ గౌడ్ శేఖర్ గౌడ్ రాములు మల్లప్ప వార్డు మెంబర్లు గ్రామస్తులు పాల్గొన్నారు

# జలమండలి ప్రధాన కార్యాలయంలో ఘనంగా బోనాల వేడుకలు



**హైదరాబాద్, ఆగస్టు 14:** ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళా ఉద్యోగులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. డప్పు చప్పుళ్లు, పోతురాజు నృత్యాలు వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉద్యోగులు, వారి కుటుంబాలతో పాటు హైదరాబాద్ మహానగర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించే ఇలాంటి వేడుకలు ఉద్యోగుల్లో ఐక్యత, ఆధ్యాత్మిక భావనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో జలమండలి డైరెక్టర్లు సుదర్శన్, ప్రభు, కేదారేశ్వరి, ఉన్నతాధికారులు, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, ఆగస్టు 14:** జిల్లాలోని ప్రతి గ్రామం, వార్డులో తాగునీటి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం పెద్దపల్లి ఐడీఓసీలో తాగునీటి సరఫరాపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.క్షేత్రస్థాయి అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని గ్రామాలు, వార్డుల వారీగా తాగునీటి సరఫరా పరిస్థితి, సమస్యలు, చేపట్టాల్సిన చర్యలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన తాగునీరు అందేలా నీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.సమావేశంలో మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ గంగాధర శ్రీనివాస్, గ్రిడ్ ఈఈ పూర్ణచందర్, ఏఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి బొట్టు నీటిని ఒడిసిపట్టాలి

## కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, ఆగస్టు 14:** వర్షపు నీటిని సద్వినియోగం చేసుకొని భూగర్భ జలమట్టాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. శుక్రవారం ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్, పిట్టబొంగారం గ్రామాల్లో ఐటీడీఏ పీఓ మంద మకరందుతో కలిసి పంటకుంటలు, బోర్‌వెల్ రీచార్జ్ పనులను పరిశీలించారు. ప్రతి బొట్టు నీటిని సంరక్షించి వ్యవసాయానికి శాశ్వత నీటి భద్రత కల్పించాలని, మిగిలిన పనులను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# జిల్లాలో 2,403 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు

**మెదక్ ఆగస్టు,14:**

జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా సమృద్ధిగా అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్ . ప్రస్తుతం మొత్తం 2,403 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉండగా, మార్క్‌ఫెడ్ వద్ద 1,855 మెట్రిక్ టన్నులు, రిటైలర్ల వద్ద 548 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆగస్టు 7 నుంచి రైతులు FSS యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసుకుని కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. రిటైలర్ కేంద్రాల్లో వాలంటీర్లు, రైతు వేదికల వద్ద వ్యవసాయ విస్తరణ అధికారులు యాప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు బుకింగ్‌లో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి సహకరిస్తున్నారని వివరించారు.

# కొడంగల్ పోలీస్ స్టేషన్ నూతన సీఐ గా చంద్రశేఖర్ రెడ్డి..

**కొడంగల్ మున్సిపల్,ఆగస్టు,14:**

వికారాబాద్ జిల్లా కొడంగల్ మున్సిపల్ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ)గా పదవి బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్ రెడ్డి నల్గొండ సీసీఎస్ నుంచి బదిలీపై వచ్చారు.




# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో లబ్ధిదారులకు ఇబ్బందులు



లేకుండా చూడాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్, ఆగస్టు 14::** ఎన్టీఆర్ మినీ స్టేడియంలో శనివారం నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించిన ఆయన పోలీసు పరేడ్ మైదానం, ప్రజాప్రతినిధులు, ముఖ్యుల సీటింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు, తాగునీరు, విద్యుత్, భద్రతా ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు.అనంతరం కడ్తాల్ సమీపంలోని సాగర్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఏర్పాట్లను పరిశీలించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని, అధికారులు సమన్వయంతో పనిచేసి రెండు కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు.అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డీఆర్వో రాథోడ్ రమేష్, డీఈవో భోజన్న, డీఎస్పీ శ్రీనివాస్, పౌర సరఫరాల అధికారి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.




# పోలీసు కవాతును పరిశీలించిన: అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ ఉల్ హక్

**నారాయణపేట,ఆగస్టు,15:**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు నారాయణపేట జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో కొనసాగుతున్న పరేడ్ ఫైనల్ ప్రాక్టీస్ కవాతును అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ ఉల్ హక్ శుక్రవారం పరిశీలించారు. ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా పోలీస్ సిబ్బందితో నిర్వహిస్తున్న పరేడ్

# జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన..

- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్.



**వికారాబాద్, ఆగస్టు,14:**

జిల్లాలో జరిగే స్వాతంత్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలనీ జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు.శుక్రవారము వికారాబాద్ జిల్లా స్వాతంత్య దినోత్సవ వేడుకలు కల్లెక్ట్రేట్ కార్యాలయ ఆవరణలో జరుపుటకు ఏర్పాట్లు చేయాలనీ, గ్రౌండ్ అంతా డస్ట్ వేసి చదును చేసి సిద్దంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా లతో కలిసి పరిశీలించారు.వేడుకలు నిర్వహించనున్న ప్రాంగణాన్ని సందర్శించిన కలెక్టర్,ఎస్పీ ఏర్పాట్ల పురోగతిని సంబంధిత అధికారు లను అడిగి తెలుసుకున్నారు. వేదిక, సీటింగ్,డెకరేషన్,పరేడ్, బందోబస్తు, పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, ప్రజలకు అవసరమైన సౌకర్యాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిం చడంతో పాటు, కార్యక్రమం విజయవంతంగా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సంవత్సరం తోలి సారిగా 1. వందే మాతర 2. జనగణ మన 3. జయ జయహే తెలంగాణా, మూడు గీతాలాపనలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు పాల్గొని తమ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్‌కు వివరించారు.ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ లు ఉమా శంకర్ ప్రసాద్, వెంకటాచారి, ట్రైని కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టుర్, డి ఆర్ ఓ స్వర్ణ లత, మహమ్మద్ సత్తార్, డి పి ఆర్ ఓ చెన్నమ్మ, ఏ ఓ పర్వీన బేగం, మున్సిపల్ కమిషనర్ విక్రం సింహ రెడ్డి, తహసిల్దార్ లక్ష్మీనారాయణ , పోలీస్ సిబ్బంది సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.



# ఖమ్మం జిల్లాను పర్యాటకంగా తీర్చిదిద్దాలి

- నీటి వనరుల పరిరక్షణతో అభివృద్ధి పనులు చేపట్టాలి: కలెక్టర్ దివాకర టీఎస్



**ఖమ్మం/బోనకల్, ఆగస్టు 14::** ఖమ్మం జిల్లాలోని సహజసిద్ధమైన నీటి వనరులు, చెరువులను పర్యావరణానికి నష్టం కలగకుండా పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసి, జిల్లాను రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బోనకల్ మండలంలోని కలకోట పెద్దచెరువు, మధిర మండలంలోని మడుపల్లి, మధిర ట్యాంక్‌బండ్ ప్రాంతాల్లో చేపడుతున్న పర్యాటక అభివృద్ధి పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.మధిర ట్యాంక్‌బండ్ వద్ద కాటేజీలు, రిసెప్షన్, కిచెన్–రెస్టారెంట్, విద్యుదీకరణ, మరుగుదొడ్లు తదితర సదుపాయాల పనులను నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని సూచించారు. కలకోట పెద్దచెరువు వద్ద బండ్ విస్తరణతో పాటు మూడు కాటేజీలు, రిసెప్షన్, కేఫెటీరియా, పార్కింగ్ తదితర సౌకర్యాల ఏర్పాటుకు సమగ్ర ప్రతిపాదనలు త్వరగా సిద్ధం చేయాలని ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, భద్రత వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు స్థానికులకు ఉపాధి,

# కస్తూర్ పల్లి లో BSP లోకి భారీ చేరికలు

- నూతన గ్రామ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన అసెంబ్లీ ఇంచార్జ్ యూ. రమేష్ బాబు

**కొడంగల్ మండలం, ఆగస్టు,14:**

కొడంగల్ మండలంలోని కస్తూర్ పల్లి గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన పెద్దలు, యువకులు అసెంబ్లీ ఇంచార్జ్ యు. రమేష్ బాబు ఆధ్వర్యంలో బహుజన్ సమాజ్ పార్టీలో పెద్ద ఎత్తున చేరారు.కొత్తగా చేరిన వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా స్వాగతించడం జరిగింది.అదే కార్యక్రమంలో కస్తూరి పల్లి బి ఎస్ పి పార్టీ గ్రామ కమిటీని కొడంగల్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన గ్రామ కమిటీ అధ్యక్షులు టి. ఎల్లప్ప ముదిరాజ్ ఉపాధ్యక్షులు కోట్రికా భీమప్ప ప్రధాన కార్యదర్శి బిచ్చల్ వెంకటప్ప యాదవ్ గ్రామ సెక్రటరీ గొల్ల రాముల యాదవ్ విలేజ్ ట్రెజరర్ శ్రీనివాస్ ముదిరాజ్ పార్టీలో చేరిన జోగి మల్లప్ప, మహబూబ్ కురువ, వెంకటప్ప, మమ్మద్ మీరా సాబ్, తెలుగు ఎల్లప్ప ముదిరాజ్, తెలుగు శ్రీనివాస్ ముదిరాజ్, చిన్న మొహమ్మద్, గొల్ల రాముల యాదవ్, ఆశప్ప, ఎడ్ల ఆశన్న, బుడగ జంగం వెంకటప్ప, ఆవుల ఆశన్న ముదిరాజ్, మాల ఆశప్ప, కోట్రికా భీమప్ప, లక్ష్మప్ప మాదిగ, మేతర తదితరులు BSP పార్టీలో చేరారు.ఈ సందర్భంగా అసెంబ్లీ ఇంచార్జ్ యు. రమేష్ బాబు, అసెంబ్లీ అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ,, బహుజన్ సమాజ్ పార్టీని గ్రామ గ్రామాల గడపగడపకు తీసుకెళ్తామని, పార్టీని బలోపేతం చేస్తామని తెలిపారు. ముందుకు వచ్చిన కస్తూర్ పల్లి పెద్దలు, యువకులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. బహుజన రాజ్యం వచ్చే వరకు అనునిత్యం బీసీ ఎస్సీ ఎస్టీలను అగ్రవర్ణాల బీదలను మత మైనార్టీలను చైతన్యం చేస్తామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కొడంగల్ నియోజకవర్గ ఇంచార్జ్ యు. రమేష్ బాబు,కొడంగల్ అసెంబ్లీ అధ్యక్షులు శ్రీనివాస్, కొడంగల్ అసెంబ్లీ ట్రెజరర్ మమ్మద్



# ప్రభుత్వ ఐటీఐకి మహర్దశ.. రూ.25 కోట్ల నిధులు మంజూరు

- 50 ఏళ్ల చరిత్రకు.. మరో 50 ఏళ్ల భవిష్యత్‌కు బాటలు — ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- స్థానిక యువతకు స్థానికంగానే ఉద్యోగాలు.. ఐటీఐని ఆధునిక స్కిల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

**వరంగల్, ఆగస్టు 14 : :** ములుగు రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల నూతన భవన నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం రూ.25 కోట్ల నిధులు మంజూరు చేయడం పట్ల వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా వేలాది మంది విద్యార్థులకు సాంకేతిక విద్య, నైపుణ్య శిక్షణ అందిస్తున్న ప్రభుత్వ ఐటీఐకి నూతన భవనం ఎంతో అవసరమన్నారు. రాబోయే మరో 50 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా ఆధునిక సదుపాయాలతో ఐటీఐని అభివృద్ధి చేసేందుకు రూ.25 కోట్లు మంజూరు చేయడం అభినందనీయమన్నారు.ఐటీఐ నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని నాలుగు నెలల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసినట్లు నాయిని తెలిపారు. తన విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన సీఎం ఇచ్చిన మాట ప్రకారం నిధులు మంజూరు చేశారని పేర్కొంటూ ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.వరంగల్‌లో నిరుద్యోగ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలంటే పరిశ్రమలు, రైల్వేలు, ఇతర ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో భవిష్యత్‌లో అవసరమయ్యే నైపుణ్యాలకు అనుగుణంగా శిక్షణ అందించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా రైల్వే రంగంలో రానున్న ఉద్యోగ అవకాశాలను ముందుగానే గుర్తించి, వాటికి అవసరమైన నైపుణ్యాలను ఐటీఐలోనే అందించేలా ప్రణాళిక రూపొందించాలని కళాశాల యాజమాన్యానికి సూచించారు.ఉద్యోగ నోటిఫికేషన్లు వెలువడే సమయానికి స్థానిక యువతకు అవసరమైన అర్హతలు, నైపుణ్యాలు సిద్ధంగా ఉండేలా ముందస్తు శిక్షణ ఇవ్వాలని అన్నారు. ఐటీఐలతో పాటు పాలిటెక్నిక్ కళాశాలలను కూడా ఆధునిక సాంకేతిక విద్యా కేంద్రాలుగా



తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందించి, చదువు పూర్తయ్యే నాటికే ఉద్యోగానికి అవసరమైన శిక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.వరంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్, మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని నాయిని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఎయిర్‌పోర్ట్, రింగ్ రోడ్, మాస్టర్ ప్లాన్ వంటి కీలక అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయని వివరించారు.ఈ ఐటీఐలో గతంలో చదివి శిక్షణ పొందిన సుమారు 50 వేల మంది పూర్వ విద్యార్థుల వివరాలను సేకరించి వారితో అనుసంధానం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో, వివిధ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్న పూర్వ విద్యార్థులను సంప్రదించి కళాశాల అభివృద్ధిలో వారి సహకారం తీసుకోవాలని కోరారు.కళాశాల ప్రాంగణాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్దాలని, ఖాళీ ప్రదేశాలను గ్రీన్ ఏరియాలుగా అభివృద్ధి చేయాలని సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర ప్రణాళికతో అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన పనుల కోసం సంబంధిత శాఖలు, కార్పొరేషన్ అధికారులతో సమన్వయం చేస్తానని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం తాత్కాలిక హామీలకే పరిమితం కాకుండా విద్య, ఉపాధి, మౌలిక వసతులు, ప్రజలకు శాశ్వత ప్రయోజనం కలిగించే అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారిస్తోందని నాయిని అన్నారు. ప్రభుత్వ ఐటీఐ నూతన భవన నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరు చేయడం కూడా అదే దిశలో తీసుకున్న కీలక నిర్ణయమని పేర్కొన్నారు.వరంగల్ యువతకు నాణ్యమైన సాంకేతిక విద్య, ఆధునిక నైపుణ్య శిక్షణ అందించి స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు లభించేలా ప్రభుత్వ ఐటీఐని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తెలుగు అకాడమీ ఛైర్మన్ ప్రొఫెసర్ వెంకట నారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అజీజ్ ఖాన్, మాజీ కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి సురేందర్, జక్కుల రవీందర్, బోడ డిన్న, డివిజన్ అధ్యక్షులు సంగీత్, అంబేద్కర్ రాజు, గోల్కొండ సాంబయ్య, సృజన్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# స్వతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన

## జిల్లా కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట, ఆగస్టు,14:**
నారాయణపేట: స్వతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక శుక్రవారం జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీను, అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ హుల్ హక్ తదితర అధికారులతో కలిసి వేడుకల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.స్వతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రజలు, విద్యార్థులు, అధికారులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యార్థులు మరియు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, స్టాల్స్ ఏర్పాటు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.వేడుకల సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు, వీఐపీలు, ప్రజలు మరియు విద్యార్థుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమన్వయంతో చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు. కార్యక్రమం సజావుగా జరిగేలా ప్రతి శాఖ తనకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ పేర్కొన్నారు.అదనపు ఎస్పీ ఎం.డీ రియాజ్ హుల్ హక్ పోలీస్ శాఖ తరపున చేపట్టిన భద్రతా ఏర్పాట్లను వివరించారు. పరేడ్, ప్రజల రాకపోకలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై సంబంధిత పోలీస్ అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో, తహసీల్దార్, టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అవయవదానం.. మరొకరికి జీవనదానం

- ఎన్టీఆర్ మహిళా కళాశాలలో అవగాహన సదస్సు




**మహబూబ్‌నగర్, ఆగస్టు 14:,:**
అవయవదానం ద్వారా మరణానంతరం కూడా ఇతరులకు కొత్త జీవితాన్ని అందించవచ్చని అఖిల భారత అవయవదాతల సంఘం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లయన్ డాక్టర్ వి. నటరాజ్ అన్నారు. మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా నటరాజ్ మాట్లాడుతూ, తమ సంఘం ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఎస్వీఎస్ మెడికల్ కళాశాలకు ఇప్పటివరకు 273 కళ్లను, 18 మృతదేహాలను దానం చేసినట్లు తెలిపారు. అవయవదానం ఒక కుటుంబానికి కొత్త ఆశను, జీవితాన్ని అందించే మహాదానమన్నారు.ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రామ్మోహన్ అవయవదానం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అమీన ముంతాజ్ జహాన్ మాట్లాడుతూ, అవయవదానంపై ఉన్న అపోహలను తొలగించి సమాజంలో అవగాహన పెంచాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అవయవదాతల సంఘం ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిరాధార ఫిర్యాదులు, తప్పుడు ప్రచారాన్ని ఉపేక్షించం

- కలెక్టర్ కోయ శ్రీహర్ష
- అధికారులను అప్రతిష్ఠపాలు చేసేలా ఫిర్యాదు చేసిన వ్యక్తికి లోకాయుక్త రూ.10 వేల జరిమానా
- తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తే చట్టప్రకారం చర్యలు



**పెద్దపల్లి, ఆగస్టు 14:** అధికారులపై నిరాధార ఆరోపణలు చేస్తూ తప్పుడు ప్రచారం చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష హెచ్చరించారు.పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌కు చెందిన బొబ్బిలి సత్యనారాయణ, గ్రామపంచాయతీ పరిధిలో ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి సరైన అనుమతులు లేవంటూ 2023 జనవరి 2న లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి నివేదికను లోకాయుక్తకు సమర్పించారని పేర్కొన్నారు.అధికారుల నివేదికను పరిశీలించిన లోకాయుక్త, సత్యనారాయణ ఫిర్యాదు నిరాధారమైనదిగా, వేధింపులకు ఉద్దేశించినదిగా పేర్కొంటూ 2025 డిసెంబర్ 22న కొట్టివేసినట్లు తెలిపారు. లోకాయుక్తతో పాటు ప్రభుత్వ అధికారుల విలువైన సమయాన్ని వృథా చేసినందుకు తెలంగాణ లోకాయుక్త చట్టంలోని సెక్షన్ 13-A కింద రూ.10 వేల జరిమానా విధించినట్లు కలెక్టర్ వెల్లడించారు.లోకాయుక్త ఆదేశాల మేరకు జరిమానా మొత్తాన్ని రెవెన్యూ రికవరీ చట్టం కింద వసూలు చేసి ముఖ్యమంత్రి సహాయనిధిలో జమ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ప్రజా సమస్యలపై వాస్తవాధారాలతో చేసే ఫిర్యాదులను ప్రభుత్వం స్వాగతిస్తుందని, అయితే వ్యక్తిగత ప్రయోజనాల కోసం అధికారులను అప్రతిష్ఠపాలు చేసేలా నిరాధార ఆరోపణలు చేయడం, తప్పుడు సమాచారం ప్రచారం చేయడం సరికాదని కలెక్టర్ పేర్కొన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో లోటుపాట్లకు తావివ్వొద్దు

- అధికారులు అప్రమత్తంగా బాధ్యతలు నిర్వర్తించాలి: ములుగు కలెక్టర్ హేమంత్ సహదేవరావు

**ములుగు, ఆగస్టు 14::** ఈ నెల 16న ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా అధికారులు అప్రమత్తంగా ఉంటూ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు.శుక్రవారం జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. మేడారం వనదేవతల ప్రాంగణం, నూతన కలెక్టరేట్, పైలాన్, గట్టమ్మ ఆలయం తదితర ప్రాంతాల్లో పటిష్ట భద్రత కల్పించాలని సూచించారు.మేడారంలో వనదేవతల దర్శనం, తులాభారం, పించన్ల పంపిణీతో పాటు నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవం, బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వొద్దని స్పష్టం చేశారు.సమావేశంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జీ, సంపత్ రావు, ఆర్డీవో కృష్ణవేణి, డీఆర్వో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# జీ.జీ.హెచ్‌లో అస్తవ్యస్త పరిస్థితులపై కలెక్టర్ ఆగ్రహం



**నిజామాబాద్, ఆగస్టు 14:** నిజామాబాద్ ప్రభుత్వ జిల్లా జనరల్ ఆసుపత్రిని కలెక్టర్ భవేష్ మిశ్రా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాల్లో డ్రైనేజీ పైప్‌లైన్ల లీకేజీలు, వ్యర్థ జలాల నిల్వ, చెత్తాచెదారం, దుర్గంధం వంటి సమస్యలను గుర్తించి అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.పారిశుధ్య సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ఆసుపత్రి లోపల, బయట ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఓపెన్ డ్రైనేజీలపై పైకప్పులు ఏర్పాటు చేయడంతో పాటు రహదారిపై గుంతలకు మరమ్మతులు చేపట్టాలని, వృథా నిర్మాణ సామగ్రిని తొలగించాలని సూచించారు. కుక్కలు, పశువులు ఆసుపత్రి ఆవరణలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ వి. భుజంగరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాములు తదితరులు ఉన్నారు.

# ఆయుష్ హౌస్ సర్జన్లు, పీజీల స్టైపెండ్ పెంచాలి

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతి

**ఉప్పల్ ఆగస్టు14:**
తెలంగాణ వ్యాప్తంగా స్టైపెండ్ పెంపు కోరుతూ AYUSH హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థులు నిరవధిక సమ్మె చేపట్టిన నేపథ్యంలో JSPS హోమియోపతి కళాశాల పీజీలు, ఇంటర్న్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్టైపెండ్ పెంపు సమస్యను వెంటనే పరిష్కరించి, ఇతర వైద్య విభాగాల విద్యార్థులతో సమానంగా న్యాయమైన స్టైపెండ్ అందించాలని కోరారు. ఇందుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.తమకు జరుగుతున్న అసమానతకు ప్రభుత్వం ముగింపు పలకాలని, స్టైపెండ్ పెంపు అమలయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని విద్యార్థులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు గంధం నాగేశ్వర్‌రావు, శివగౌడ్, పార్టీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



# షాబాద్ లో MRPS నియోజకవర్గ స్థాయి సమావేశం

- మత దురహంకారం, కుల వివక్షత లేని సమాజం కోసం పోరాడుతాం - రాగల్ల ఉపేందర్
- సెప్టెంబర్ 9న వరంగల్ లో MRPS మండల కమిటీల జాతీయ సదస్సు



**షాబాద్: ఆగస్టు 14:**
చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండల కేంద్రంలో MRPS మరియు అనుబంధ విభాగాల నియోజకవర్గ స్థాయి సమావేశం మల్కి ప్రవీణ్ మాదిగ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా ఇంచార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ మత దురహంకారం, కుల వివక్షత, సాంఘిక అసమానతలు లేని సమాజం కోసం MRPS పోరాడుతుందని అన్నారు. మూడు దశాబ్దాలుగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సి వర్గీకరణతో పాటు పేద వర్గాల సంక్షేమం కోసం ఉద్యమాలు చేసినట్లు తెలిపారు.కుల వ్యవస్థను రూపుమాపి, పూలే, అంబేద్కర్, జగజీవన్ రామ్, కాన్షిరామ్ ల ఆశయాలతో పీడిత వర్గాల విముక్తి కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలో నూతన కమిటీలను ఏర్పాటు చేసి యువతను ఉద్యమంలోకి తీసుకురావాలని సూచించారు.సెప్టెంబర్ 9న వరంగల్ లో MRPS మండల కమిటీల జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో షాబాద్ మండల నాయకులు విశ్వం మాదిగ, జంగయ్య మాదిగ, మల్కి ప్రవీణ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఎరువులకు కొరత లేదు

## జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్




**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 14:** జిల్లాలో పంటల సాగుకు అవసరమైన ఎరువులకు ఎలాంటి కొరత లేదని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఎరువుల సరఫరా, నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు.పంటల అవసరాలకు అనుగుణంగా అన్ని రకాల ఎరువులను జిల్లాలో తగినంత నిల్వ ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలని, వ్యవసాయ శాఖ అధికారులు తమ పరిధిలోని ఎరువుల దుకాణాలను నిరంతరం తనిఖీ చేయాలని సూచించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, సహకార శాఖ అధికారి రామకృష్ణ, మార్క్‌ఫెడ్ డీఎం హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

# అట్రాసిటీస్ బాధితులకు సకాలంలో పరిహారం అందించాలి

## కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి, ఆగస్టు 14:** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ కేసుల్లో బాధితులకు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం సకాలంలో పరిహారం, ఇతర సహాయాలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లో నిర్వహించిన జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కేసుల నమోదు, దర్యాప్తు, పరిహారం చెల్లింపు పురోగతిని సమీక్షించారు. ప్రతి నెల 'సివిల్ రైట్స్ డే' నిర్వహించి ఎస్సీ, ఎస్టీల హక్కులపై అవగాహన కల్పించడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు, పోలీసు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మండల స్థాయి ప్రజావాణిని సమర్థవంతంగా నిర్వహించాలి

## జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్

**మంచిర్యాల, ఆగస్టు 14::** ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్ అధికారులను ఆదేశించారు.నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో శుక్రవారం జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ నిర్వహించారు. ప్రజల నుంచి అందే సమస్యలు, ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంబంధిత శాఖలకు పంపించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.డేటా ఎంట్రీ, ఫిర్యాదుల నమోదు, రసీదు జారీ తదితర సాంకేతిక అంశాలపై శిక్షణ అందించారు. ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించడమే ప్రజావాణి ప్రధాన లక్ష్యమని మోతిరామ్ తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# తెలంగాణ ఉద్యమ జ్వాల.. శ్రీకాంతాచారి

నేడు మలిదశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి జయంతి

## 'జై తెలంగాణ' నినాదంతో ఆత్మత్యాగం

ఆయన బలిదానంతో ఉవ్వెత్తున ఎగిసిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం

## తెలంగాణ చరిత్రలో చెరగని త్యాగమూర్తి

**తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన మలిదశ ఉద్యమ చరిత్రలో కాసోజు శ్రీకాంతాచారి పేరు చెరగని అక్షరాలతో నిలిచిపోయింది. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష కోసం ప్రాణాలను సైతం తృణప్రాయంగా భావించిన ఆయన మలిదశ తెలంగాణ ఉద్యమ తొలి అమరుడిగా ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు. ఆగస్టు 15 శ్రీకాంతాచారి జయంతి సందర్భంగా ఆయన త్యాగాన్ని తెలంగాణ సమాజం మరోసారి స్మరించుకుంటోంది.**

నల్గొండ జిల్లా మోత్కూరు మండలం పొడిచేడు గ్రామానికి చెందిన కాసోజు వెంకటచారి, శంకరమ్మ దంపతుల పెద్ద కుమారుడిగా 1986 ఆగస్టు 15న శ్రీకాంతాచారి జన్మించారు. సాధారణ కుటుంబంలో పుట్టిన ఆయన చిన్ననాటి నుంచే చురుకుగా ఉండేవారు. సమాజ సేవలో ముందుండటంతోపాటు తన వద్ద ఉన్నదానిలో ఇతరులకు సాయం చేసే స్వభావం కలిగి ఉండేవారు. స్థానికంగా ప్రాథమిక విద్య పూర్తిచేసి మోత్కూరు, నకిరేకల్ ప్రాంతాల్లో చదువుకున్నారు. ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత రాజకీయ, విద్యార్థి ఉద్యమాల వైపు ఆకర్షితులయ్యారు. తొలుత బీజేపీలో, అనంతరం టీఆర్‌ఎస్‌లో క్రియాశీల కార్యకర్తగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా జరిగిన ఉద్యమ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు.

### తెలంగాణే ఊపిరిగా..

శ్రీకాంతాచారి నిత్యం తెలంగాణ గురించే ఆలోచించేవారని సన్నిహితులు గుర్తుచేసుకుంటారు. తెలంగాణ పాటలు పాడటం, నినాదాలు చేయడం, కవితలు రాయడం ఆయన జీవితంలో భాగమయ్యాయి. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష ఆయనలో బలంగా నాటుకుపోయింది. 2009లో తెలంగాణ ఉద్యమం కీలక మలుపు తిరిగింది. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్ష, అనంతరం చోటుచేసుకున్న అరెస్టులు, ఉద్యమకారులపై పోలీసుల చర్యలు శ్రీకాంతాచారిని తీవ్రంగా కలచివేశాయి. 2009 నవంబరు 29న హైదరాబాద్ ఎల్బీనగర్ చౌరస్తాలో జరిగిన నిరసన సందర్భంగా శ్రీకాంతాచారి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. మంటల్లో చిక్కుకున్న సమయంలోనూ 'జై తెలంగాణ' అంటూ నినదించిన ఘటన ఉద్యమకారులను కదిలించింది. తీవ్ర కాలిన గాయాలతో పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన ఆయన ఐదు రోజుల పాటు మృత్యువుతో పోరాడారు. చివరకు 2009 డిసెంబర్ 3 రాత్రి తుదిశ్వాస విడిచారు.

### త్యాగంతో రగిలిన ఉద్యమం

శ్రీకాంతాచారి ఆత్మత్యాగం తెలంగాణ ఉద్యమాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. ఆయన మరణవార్తతో తెలంగాణ ప్రాంతంలో విద్యార్థులు, యువత, ఉద్యోగులు, ప్రజాసంఘాల్లో ఉద్యమావేశం మరింత పెరిగింది. ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆయన త్యాగం ఒక కీలక జ్ఞాపకంగా నిలిచిపోయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా శ్రీకాంతాచారి పేరు ఉద్యమ త్యాగానికి ప్రతీకగా వినిపిస్తూనే ఉంది. రాష్ట్ర సాధన చరిత్రను చెప్పుకునే ప్రతిసారీ ఆయన బలిదానం గుర్తుకొస్తుంది. ఆగస్టు 15 దేశానికి స్వాతంత్ర్య దినోత్సవం... అదే రోజు తెలంగాణ ఉద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన శ్రీకాంతాచారి జన్మదినం. ఆయన జీవితం చిన్నదే అయినా.. తెలంగాణ కోసం చేసిన త్యాగం మాత్రం తరతరాలకు గుర్తుండిపోతుంది.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# స్వాతంత్ర్య సంబరాలకు మహాత్ముడు ఎందుకు దూరం?

## దేశమంతా పండుగ.. గాంధీ మనసంతా విభజన వేదన

ఢిల్లీలో స్వేచ్ఛా సంబరాలు.. బెంగాల్‌లో శాంతి కోసం మహాత్ముడి ప్రయత్నం

హిందూ-ముస్లిం రక్తపాతం మధ్య వేడుకలకు ఎలా రావాలన్న గాంధీ

దేశ విభజన కలచివేయడంతో ప్రార్థన, ఉపవాసంతో గడిపిన స్వాతంత్ర్య దినం

1947 ఆగస్టు 15న చరిత్రలో నిలిచిపోయిన మహాత్ముడి మౌనం



రెండు శతాబ్దాల బ్రిటిష్ పాలనకు తెరపడింది. దశాబ్దాల స్వాతంత్ర్య పోరాటం ఫలించింది. 1947 ఆగస్టు 15న భారతావని స్వేచ్ఛావాయువులు పీల్చుకుంది. దేశమంతా ఆనందోత్సాహాలతో ఉప్పొంగింది. ఢిల్లీలో చారిత్రక వేడుకలు జరిగాయి. కానీ స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచడంలో కీలకపాత్ర పోషించిన మహాత్మా గాంధీ మాత్రం ఆ సంబరాల్లో కనిపించలేదు. దేశమంతా పండుగ చేసుకుంటున్న వేళ ఆయన ఎందుకు దూరంగా ఉన్నారన్నది చరిత్రలో ఆసక్తికరమైన, అంతకుమించి విషాదకరమైన అధ్యాయం. దేశ విభజనను చివరి వరకు వ్యతిరేకించిన గాంధీకి స్వాతంత్ర్యంతోపాటు భారత్ రెండు ముక్కలు కావడం తీవ్ర వేదన కలిగించింది. హిందువులు, ముస్లింల మధ్య ఐక్యతతో కూడిన భారతదేశాన్నే ఆయన కోరుకున్నారు. విభజనను నివారించేందుకు మహమ్మద్ అలీ జిన్నాకు ప్రభుత్వ నాయకత్వ బాధ్యతలు అప్పగించే అవకాశాన్ని కూడా పరిశీలించాలని గాంధీ సూచించిన సందర్భాలున్నాయి. కానీ అప్పటికే రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోయాయి. కాంగ్రెస్, ముస్లిం లీగ్, బ్రిటిష్ పాలకుల మధ్య జరిగిన పరిణామాలు చివరకు విభజనకు దారితీశాయి.

### ఢిల్లీలో ఆనందం.. బెంగాల్‌లో రక్తపాతం

స్వాతంత్ర్యం సమీపిస్తున్న సమయంలో దేశంలోని అనేక ప్రాంతాల్లో మత ఘర్షణలు చెలరేగాయి. ముఖ్యంగా బెంగాల్, పంజాబ్ ప్రాంతాల్లో పరిస్థితులు తీవ్రంగా మారాయి. హిందువులు, ముస్లింల మధ్య హింసను నిలువరించడమే తన ముందున్న అతిపెద్ద బాధ్యతగా గాంధీ భావించారు. 1946 నుంచే ఆయన బెంగాల్, బీహార్ తదితర హింస ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. వృద్ధాప్యాన్ని కూడా లెక్కచేయకుండా గ్రామాలు తిరిగి హిందూ, ముస్లిం వర్గాలతో మాట్లాడారు. ప్రతీకారం సమస్యకు పరిష్కారం కాదని, మతసామరస్యమే దేశాన్ని నిలబెడుతుందని నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. 1947 ఆగస్టు నాటికి ఆయన కలకత్తాలోని బెలియాఘాటాలో ఉన్నారు. దేశ రాజధానిలో స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు జరుగుతుంటే గాంధీ మాత్రం మతహింసను ఆపేందుకు ప్రజల మధ్యే ఉండిపోయారు.

### ఇక్కడ మనుషులు చస్తుంటే..

తొలి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు గాంధీ హాజరుకావాలని కాంగ్రెస్ నాయకులు కోరుకున్నారు. కానీ ఆయన ప్రాధాన్యం వేడుకలకంటే మతహింసను నిలువరించడానికే ఇచ్చారు. హిందూ, ముస్లింలు పరస్పరం ప్రాణాలు తీసుకుంటున్న సమయంలో తాను సంబరాల్లో ఎలా పాల్గొనగలనన్న భావనతో ఢిల్లీకి వెళ్లలేదు. పత్రికలు స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా సందేశం కోరినా గాంధీ ఉత్సాహభరితమైన సందేశం ఇచ్చేందుకు సిద్ధపడలేదు. స్వేచ్ఛ వచ్చిన ఆనందం ఉన్నప్పటికీ దేశ విభజన, మతహింస ఆయనను తీవ్రంగా కలచివేశాయి.

### దేశం మేల్కొన్న వేళ..

1947 ఆగస్టు 14 అర్ధరాత్రి ఢిల్లీలో జవహర్‌లాల్ నెహ్రూ చారిత్రక 'ట్రిస్ట్ విత్ డెస్టినీ' ప్రసంగం చేశారు. కొత్త భారతదేశం ఆవిర్భావాన్ని ప్రపంచానికి ప్రకటించారు. దేశమంతా ఆ చారిత్రక క్షణాన్ని ఆసక్తిగా వీక్షించింది. కానీ గాంధీ మాత్రం ఢిల్లీ వెలుగులకు దూరంగా ఉన్నారు. స్వాతంత్ర్య దినాన్ని ఆయన ప్రార్థన, ఉపవాసం, శాంతి ప్రయత్నాలతో గడిపారు. ఆయన దృష్టిలో బ్రిటిష్ పాలన నుంచి విముక్తి పొందడం మాత్రమే స్వాతంత్ర్యం కాదు. హిందువులు, ముస్లింలు సోదరభావంతో జీవించినప్పుడే నిజమైన స్వాతంత్ర్యానికి అర్థముంటుంది.

### వేడుకలకంటే మనుషుల ప్రాణాలే ముఖ్యం

తాను జీవితాంతం అహింసను ఆయుధంగా చేసుకుని పోరాడిన దేశంలోనే స్వాతంత్ర్యం వచ్చే సమయంలో మతం పేరుతో మనుషులు ఒకరినొకరు చంపుకోవడం గాంధీని తీవ్రంగా బాధించింది. అందుకే ఢిల్లీలో జరిగే అధికారిక సంబరాల కంటే హింసతో అట్టుడుకుతున్న ప్రాంతంలో ఉండటానికే ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. అందుకే 1947 ఆగస్టు 15 భారత చరిత్రలో రెండు భిన్న దృశ్యాలను మిగిల్చింది. ఢిల్లీలో స్వాతంత్ర్యపు వెలుగులు వెలిగితే.. బెంగాల్‌లో మతసామరస్యం కోసం మహాత్ముడు నడిచారు. దేశం స్వేచ్ఛను వేడుకగా జరుపుకుంటే.. గాంధీ మాత్రం విభజన గాయాలకు మందు వేసే ప్రయత్నంలో ఉన్నారు. **అదే తొలి స్వాతంత్ర్య దినోత్సవానికి మహాత్ముడు దూరంగా ఉండటానికి అసలు కారణం.**

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# భారత జాతీయ పతాక తయారీ, నిబంధనలు

**భారతదేశ సార్వభౌమత్వానికి, స్వాతంత్ర్యానికి, జాతీయ సమైక్యతకు ప్రతీకగా రెపరెపలాడే మువ్వన్నెల జెండా ప్రతి భారతీయుడి గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. కాషాయం, తెలుపు, పచ్చ రంగులతో మధ్యలో 24 ఆకుల నీలిరంగు అశోక చక్రంతో కనిపించే జాతీయ పతాకం వెనుక ప్రత్యేక చరిత్రతోపాటు దాని తయారీ, వినియోగానికి నిర్దిష్టమైన నియమాలు ఉన్నాయి.**

### 1947 జూలై 22న ఆమోదం

ప్రస్తుతం మనం చూస్తున్న జాతీయ పతాక రూపాన్ని 1947 జూలై 22న రాజ్యాంగ పరిషత్ ఆమోదించింది. స్వాతంత్ర్యం వచ్చిన 1947 ఆగస్టు 15 నుంచి అధికారిక జాతీయ పతాకంగా వినియోగంలోకి వచ్చింది. అనంతరం భారత గణతంత్రానికి కూడా ఇదే పతాకం జాతీయ చిహ్నంగా కొనసాగింది. జెండా దీర్ఘచతురస్రాకారంలో ఉంటుంది. పైభాగంలో కాషాయం, మధ్యలో తెలుపు, కింద పచ్చ రంగు సమాన నిష్పత్తిలో ఉంటాయి. తెలుపు రంగు మధ్యలో నేవీ నీలం రంగులో 24 ఆకులతో కూడిన అశోక చక్రం ఉంటుంది. పతాకం పొడవు, వెడల్పుల నిష్పత్తి 3:2గా ఉంటుంది.

### తయారీలోనూ కచ్చితమైన ప్రమాణాలు

జాతీయ పతాకం తయారీ విషయంలో భారత ప్రమాణాల సంస్థ నిర్దేశించిన ప్రమాణాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. రంగుల ఛాయలు, అశోక చక్రం ఆకృతి, పతాక కొలతలు తదితర అంశాలకు ప్రమాణాలు నిర్దేశించారు. తయారైన జెండా నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాల్సి ఉంటుంది. కాలానుగుణంగా జాతీయ పతాక తయారీ నిబంధనల్లోనూ మార్పులు వచ్చాయి. ఒకప్పుడు చేతితో నేసిన ఖాదీ వస్త్రానికే పరిమితమైన నిబంధనలను తర్వాత సవరించారు. ప్రస్తుతం జాతీయ పతాక నియమావళిలో చేసిన మార్పుల ప్రకారం చేతితో నేసిన లేదా యంత్రంతో తయారుచేసిన పత్తి, పాలిస్టర్, ఉన్ని, పట్టు, ఖాదీ బంటింగ్‌తో కూడా జాతీయ పతాకాన్ని తయారు చేయవచ్చు.



### పౌరులకూ జెండా ఎగురవేసే హక్కు

ఒకప్పుడు సాధారణ ప్రజలు జాతీయ దినోత్సవాలు మినహా అన్ని రోజుల్లో జెండాను ఎగురవేసే విషయంలో పరిమితులు ఉండేవి. పారిశ్రామికవేత్త నవీన్ జిందాల్ సాగించిన న్యాయపోరాటం అనంతరం ఈ విషయంలో కీలక మార్పులు వచ్చాయి. 2002 జనవరి 26 నుంచి అమల్లోకి వచ్చిన జాతీయ పతాక నియమావళితో పతాక గౌరవానికి భంగం కలగకుండా సాధారణ పౌరులు కూడా జాతీయ పతాకాన్ని ప్రదర్శించేందుకు అవకాశం లభించింది. జాతీయ పతాకాన్ని గౌరవంగా ఎగురవేయడం భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలో భాగమని సుప్రీంకోర్టు పేర్కొన్నప్పటికీ అది సంపూర్ణమైన, అపరిమితమైన హక్కు కాదు. జాతీయ పతాక గౌరవాన్ని పరిరక్షించే చట్టాలు, నియమాలకు లోబడే ఆ హక్కును వినియోగించుకోవాలి.

### జెండా విషయంలో ఇవి తప్పనిసరి

జాతీయ పతాకాన్ని నేలకు లేదా నీటికి తాకేలా చేయకూడదు. చిరిగిన, మాసిపోయిన లేదా దెబ్బతిన్న పతాకాన్ని ప్రదర్శించకూడదు. జెండాను అలంకరణ వస్తువుగా లేదా వస్తువులను చుట్టేందుకు ఉపయోగించరాదు. పతాకంపై అక్షరాలు రాయడం, దాని గౌరవానికి భంగం కలిగే విధంగా ఉపయోగించడం కూడదు. ఇతర జెండాలతో ప్రదర్శించినప్పుడు కూడా జాతీయ పతాకానికి నిర్దేశించిన గౌరవం తప్పనిసరిగా పాటించాలి.

### పాడైన జెండాను పారేయొద్దు

జాతీయ పతాకం చిరిగిపోయినా, పాడైపోయినా చెత్తలో పడేయడం తగదు. దాని గౌరవానికి భంగం కలగని విధంగా వ్యక్తిగతంగా పూర్తిగా నాశనం చేయాలి. జాతీయ పతాక నియమావళి ప్రకారం దహనం చేయడం లేదా పతాక గౌరవాన్ని కాపాడే ఇతర సముచిత పద్ధతిని అనుసరించవచ్చు.

### మువ్వన్నెలు.. మన గౌరవం

జాతీయ పతాకం కేవలం మూడు రంగుల వస్త్రం కాదు. స్వాతంత్ర్య పోరాటం, త్యాగాలు, దేశ సమైక్యత, సార్వభౌమత్వానికి అది నిలువెత్తు ప్రతీక. అందుకే జెండాను ఎగురవేయడం ఎంత గర్వకారణమో.. దాని గౌరవాన్ని కాపాడటం కూడా అంతే బాధ్యత. మువ్వన్నెల పతాకం రెపరెపలాడిన ప్రతిసారీ దేశం కోసం త్యాగం చేసిన తరాల చరిత్రను గుర్తుచేసుకోవడమే దానికి మనం ఇచ్చే నిజమైన గౌరవం.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# తొలి టెస్టు టీమ్‌లో బిగ్ సర్‌ప్రైజ్



**సీనియర్‌కు నో ప్లేస్, కొత్త కుర్రాడు అరంగేట్రం!**

**గాలే, ఆగస్టు 14:** శ్రీలంకతో శనివారం నుంచి గాలే వేదికగా ప్రారంభం కానున్న తొలి టెస్టుకు టీమిండియా తుది జట్టు ఎలా ఉండబోతుందన్న ఆసక్తి అందరిలో పెరిగింది. ఈ క్రమంలో భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన ప్లేయింగ్ ఎలెవన్‌ను వెల్లడించాడు. అయితే యాష్ జట్టులో ఊహించని మార్పులు ఉన్నాయి. ముఖ్యంగా సీనియర్ పేసర్ ప్రసిద్ధ్ కృష్ణను అశ్విన్ తుది జట్టులోకి తీసుకోకపోవడం అందరి షాక్‌కు గురిచేసింది. సాయి సుదర్శన్ గాయం కారణంగా సర్ఫరాజ్ ఖాన్ తిరిగి భారత టెస్టు జట్టులోకి వచ్చాడు. దీంతో నంబర్-6 స్థానంపై ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్ మధ్య పోటీ నెలకొంది. అయితే అశ్విన్ మాత్రం సర్ఫరాజ్ కంటే జురెల్‌నే ఎంపిక చేశాడు. ఉపఖండ పరిస్థితుల్లో సర్ఫరాజ్‌కు ఉన్న అనుభవం, స్పిన్‌ను ఎదుర్కొనే నైపుణ్యం ఉన్నప్పటికీ.. తుది జట్టులో జురెల్‌కు ప్రాధాన్యం ఇచ్చాడు. ఓపెనర్లుగా యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్‌ను ఆర్ అశ్విన్ ఎంచుకున్నాడు. మూడో స్థానంలో సాయి సుదర్శన్ స్థానాన్ని దేవదత్ పడిక్కల్‌తో భర్తీ చేశాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేయనున్నాడు. రిషభ్ పంత్ ఐదో స్థానంలో వికెట్ కీపర్ బ్యాటర్‌గా ఆడనుండగా.. ధ్రువ్ జురెల్ ఆరో స్థానంలో స్పెషలిస్ట్ బ్యాటర్‌గా బరిలోకి దిగుతాడని అశ్విన్ చెప్పాడు. పంత్, జురెల్ ఇద్దరికీ యాష్ ఒకేసారి తుది జట్టులోకి చోటిచ్చాడు. సర్ఫరాజ్ ఖాన్ చాలా కాలం తర్వాత తిరిగి జట్టులోకి వచ్చినప్పటికీ.. తొలి టెస్టులో అతడికి చోటు ఇవ్వలేదు ఆర్ అశ్విన్. ధ్రువ్ జురెల్ ఇటీవలి ఫామ్‌పై ప్రశ్నలు ఉన్నప్పటికీ.. అతడి వికెట్ కీపింగ్ సామర్థ్యం, బ్యాటింగ్‌లో ఉన్న అవకాశాలను దృష్టిలో పెట్టుకుని జట్టులోకి తీసుకోవచ్చని చెప్పాడు. రవీంద్ర జడేజా, మానవ్ సుతార్‌లను స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్లుగా.. కుల్దీప్ యాదవ్‌ను స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా ఎంపిక చేశాడు. గాలే పిచ్ టెస్ట్ మ్యాచ్ సాగేకొద్దీ స్పిన్‌కు అనుకూలించే అవకాశం ఉండటంతో ఈ కాంబినేషన్ వర్కౌట్ అవుతుందని అశ్విన్ భావించాడు. అశ్విన్ జట్టులో బిగ్ సర్‌ప్రైజ్ గుర్నూర్ బ్రార్ ఎంపిక. సీనియర్ పేసర్ ప్రసిద్ధ్ కృష్ణకు బదులుగా గుర్నూర్‌ను తుది జట్టులోకి తీసుకున్నాడు. శ్రీలంకతో జరిగే తొలి టెస్టులో గుర్నూర్ టెస్టు అరంగేట్రం చేయవచ్చని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. మహ్మద్ సిరాజ్‌తో కలిసి గుర్నూర్ కొత్త బంతిని పంచుకోనున్నాడని చెప్పాడు. వార్మప్ మ్యాచ్‌లో తన వేగం, బౌన్స్‌తో శ్రీలంక బ్యాటర్లను ఇబ్బంది పెట్టిన గుర్నూర్. తొలి టెస్టులో మరింత ప్రభావవంతంగా బౌలింగ్ చేస్తాడని యాష్ పేర్కొన్నాడు.

**అశ్విన్ ప్లేయింగ్ ఎలెవన్:**

యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, మానవ్ సుతార్, గుర్నూర్ బ్రార్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్.

# రూ.100కే ఫుట్‌బాల్ క్లబ్!

- జమ్‌షెడ్‌పూర్ ఎఫ్‌సీ వాటాల బదిలీకి టాటా స్టీల్ నిర్ణయం
- చర్చిల్ బ్రదర్స్‌తో కుదిరిన ఒప్పందం
- లైసెన్స్‌తోపాటు 12 మంది ఆటగాళ్లు, ఇద్దరు కోచ్‌ల కాంట్రాక్టులూ బదిలీ
- అనుమతులు వస్తే మళ్లీ అగ్రశ్రేణి లీగ్‌లోకి గోవా క్లబ్



**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** భారత ఫుట్‌బాల్‌లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. టాటా స్టీల్ యాజమాన్యంలోని జమ్‌షెడ్‌పూర్ ఎఫ్‌సీకి సంబంధించిన పూర్తి వాటాలను కేవలం రూ.100 టోకెన్ ధరకు గోవాకు చెందిన చర్చిల్ బ్రదర్స్‌కు బదిలీ చేసేందుకు టాటా స్టీల్ డైరెక్టర్ల కమిటీ ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఇరు యాజమాన్యాల మధ్య ఒప్పందం కుదిరింది. అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య నుంచి అవసరమైన అనుమతులు లభిస్తే 15 రోజుల్లో బదిలీ ప్రక్రియ పూర్తయ్యే అవకాశముంది. ఈ ఒప్పందంలో భాగంగా జమ్‌షెడ్‌పూర్ ఎఫ్‌సీకి ఉన్న అగ్రశ్రేణి లీగ్ స్పోర్టింగ్ లైసెన్స్‌తోపాటు 12 మంది ఆటగాళ్లు, ఇద్దరు కోచ్‌ల ఒప్పందాలు కూడా చర్చిల్ బ్రదర్స్‌కు బదిలీ కానున్నాయి. దీంతో చర్చిల్ బ్రదర్స్ తిరిగి దేశ అగ్రశ్రేణి ఫుట్‌బాల్ పోటీల్లో అడుగుపెట్టేందుకు మార్గం సుగమం కానుంది. క్లబ్ స్థాయి వృత్తిపరమైన ఫుట్‌బాల్ నుంచి వైదొలగాలని టాటా స్టీల్ నిర్ణయించుకోవడమే ఈ పరిణామానికి కారణంగా తెలుస్తోంది. ఇకపై టాటా ఫుట్‌బాల్ అకాడమీ ద్వారా క్షేత్రస్థాయి, యువజన ఫుట్‌బాల్ అభివృద్ధి, కొత్త ప్రతిభను వెలికితీయడంపై ప్రధానంగా దృష్టి సారించాలని సంస్థ భావిస్తోంది. మరోవైపు చర్చిల్ బ్రదర్స్‌కు ఈ ఒప్పందం కీలక అవకాశంగా మారింది. గతంలో ఐ-లీగ్‌లో సత్తాచాటిన ఆ క్లబ్‌కు పాయింట్ల వివాదం కారణంగా అగ్రశ్రేణి లీగ్‌కు పదోన్నతి దక్కలేదు. తాజాగా జమ్‌షెడ్‌పూర్ ఎఫ్‌సీ లైసెన్స్ బదిలీకి మార్గం సుగమం కావడంతో మరోసారి అగ్రస్థాయి భారత ఫుట్‌బాల్‌లో సత్తా చాటేందుకు చర్చిల్ బ్రదర్స్ సిద్ధమవుతోంది.

# కంగారూల గడ్డపై తంజిద్ గర్జన!

**ఆస్ట్రేలియాపై రికార్డు శతకంతో చెలరేగిన బంగ్లా ఓపెనర్**

**ఆసీస్‌పై టెస్టు సెంచరీ చేసిన తొలి బంగ్లాదేశ్ బ్యాటర్‌గా ఘనత**

**హసన్ మహమూద్ ఆరు వికెట్లు.. శాంటో 84 పరుగులు**

**రెండో రోజు ఆట ముగిసేసరికి 153 పరుగుల ఆధిక్యంలో బంగ్లాదేశ్**



**డార్విన్, ఆగస్టు 14:** ఆస్ట్రేలియా గడ్డపై బంగ్లాదేశ్ అదరగొడుతోంది. తొలి టెస్టులో ఆతిథ్య జట్టును తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకే కుప్పకూల్చిన బంగ్లా.. బ్యాటింగ్‌లోనూ సత్తాచాటి మ్యాచ్‌పై పట్టుబిగించింది. ఓపెనర్ తంజిద్ హసన్ తమీమ్ 101 పరుగులతో రికార్డు శతకం సాధించగా, కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ శాంటో 84 పరుగులతో రాణించాడు. 23 ఏళ్ల తర్వాత ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు ఆడుతున్న బంగ్లాదేశ్‌కు తంజిద్ చిరస్మరణీయ ఇన్నింగ్స్ అందించాడు. స్టార్క్, కమిన్స్, హేజిల్‌వుడ్ వంటి పేసర్లను సమర్థంగా ఎదుర్కొని సెంచరీ పూర్తి చేశాడు. దీంతో ఆస్ట్రేలియాపై టెస్టుల్లో శతకం సాధించిన తొలి బంగ్లాదేశ్ బ్యాటర్‌గా తంజిద్ రికార్డు సృష్టించాడు. అంతకుముందు హసన్ మహమూద్ 55 పరుగులిచ్చి ఆరు వికెట్లు పడగొట్టి ఆస్ట్రేలియా బ్యాటింగ్‌ను దెబ్బతీశాడు. అనంతరం తంజిద్, శాంటో కీలక భాగస్వామ్యంతో బంగ్లాదేశ్‌ను భారీ స్కోరు దిశగా నడిపించారు. చివర్లో ఆసీస్ బౌలర్లు పుంజుకుని లిటన్ దాస్, ముష్ఫికర్ రహీంను పెవిలియన్‌కు పంపినా బంగ్లా జోరును పూర్తిగా అడ్డుకోలేకపోయారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ 6 వికెట్లకు 351 పరుగులు చేసింది. మెహిదీ హసన్ మిరాజ్ 32, హసన్ మహమూద్ 13 పరుగులతో క్రీజులో ఉన్నారు. ఇప్పటికే 153 పరుగుల ఆధిక్యం సాధించిన బంగ్లాదేశ్ తొలి టెస్టుపై పట్టు బిగించింది.



# గార్డనర్‌కే క్రికెట్ ఆస్ట్రేలియా మద్దతు

**వైస్ కెప్టెన్‌గా కొనసాగించేందుకు నిర్ణయం**

**వ్యక్తిగత వివాదం జట్టుపై ప్రభావం చూపకుండా జాగ్రత్తలు**

**జార్జియా వోల్ ఎంపికపై చర్చలకు గార్డనర్ దూరం**

**తుది జట్టు ఎంపికలోనూ నిర్ణయాధికారం ఉండదని స్పష్టీకరణ**

**సిడ్నీ, ఆగస్టు 14:** వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆరోపణలతో వివాదంలో చిక్కుకున్న ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ ఆష్లే గార్డనర్‌కు క్రికెట్ ఆస్ట్రేలియా మద్దతుగా నిలిచింది. సహచర క్రీడాకారిణి జార్జియా వోల్‌తో గార్డనర్‌కు సంబంధం ఉందంటూ ఆమె భార్య మోనికా రైట్ చేసిన ఆరోపణల నేపథ్యంలోనూ వైస్ కెప్టెన్‌గా గార్డనర్‌ను కొనసాగించాలని బోర్డు నిర్ణయించింది. గార్డనర్ నాయకత్వ బాధ్యతలపై బోర్డు సమావేశంలో చర్చించినట్లు క్రికెట్ ఆస్ట్రేలియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ టాడ్ గ్రీన్‌బర్గ్ తెలిపారు. అన్ని అంశాలను పరిశీలించిన అనంతరం ఆమెను వైస్ కెప్టెన్‌గా కొనసాగించేందుకే మొగ్గు చూపినట్లు వెల్లడించారు. అయితే వ్యక్తిగత సంబంధాలు జట్టు ఎంపిక, వాతావరణంపై ప్రభావం చూపకుండా క్రికెట్ ఆస్ట్రేలియా కొన్ని జాగ్రత్తలు తీసుకుంది. వైస్ కెప్టెన్‌గా ఉన్నప్పటికీ తుది జట్టు ఎంపికలో గార్డనర్‌కు ఎలాంటి నిర్ణయాధికారం ఉండదని స్పష్టం చేసింది. ముఖ్యంగా జార్జియా వోల్ ఎంపిక, జట్టులో ఆమె స్థానం, ప్రదర్శన తదితర అంశాలపై సెలెక్టర్లు లేదా ఇతర అధికారులతో గార్డనర్ చర్చించకూడదని సూచించింది. జట్టులో అపోహలు, అసౌకర్య పరిస్థితులు తలెత్తకుండా ఉండేందుకే ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు బోర్డు పేర్కొంది. మిగిలిన అంశాలను సంబంధిత వ్యక్తుల వ్యక్తిగత వ్యవహారంగానే పరిగణిస్తున్నట్లు స్పష్టం చేసింది.



# అశ్విన్ ఇంటికి సడన్‌గా పోలీసులు!

**వరుస ఫోన్‌కాల్స్‌తో మాజీ స్పిన్నర్‌లో టెన్షన్**

**'పోలీసులు వచ్చారు' అనగానే ఒక్కసారిగా షాక్**

**చివరకు విషయం తెలిసి ఊపిరి పీల్చుకున్న అశ్విన్**

**పాస్‌పోర్టు అందించేందుకే వచ్చారంటూ అసలు విషయం వెల్లడి**

**చెన్నై, ఆగస్టు 14:** టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఇంటికి అకస్మాత్తుగా పోలీసులు రావడం ఆయనను కాసేపు కంగారు పెట్టింది. తన ఛానల్ కోసం వీడియో రికార్డు చేస్తున్న సమయంలో జరిగిన ఈ ఆసక్తికర ఘటనను అశ్విన్ స్వయంగా వెల్లడించాడు. వీడియో రికార్డింగ్‌లో ఉండగా ఇంటి సెక్యూరిటీ గార్డు వరుసగా మూడు, నాలుగుసార్లు ఫోన్ చేశాడని అశ్విన్ తెలిపాడు. సాధారణంగా అతడు అన్నిసార్లు ఫోన్ చేయడని, అయితే రికార్డింగ్‌లో బిజీగా ఉండటంతో కాల్స్ పట్టించుకోలేదన్నాడు. అదే సమయంలో భార్య నుంచి కూడా ఫోన్ రావడంతో ఏదో ముఖ్యమైన విషయం జరిగిందని అనుమానం వచ్చిందని చెప్పాడు. తిరిగి భార్యకు ఫోన్ చేయగా ఇంటికి పోలీసులు వచ్చారని చెప్పడంతో ఒక్కసారిగా షాక్‌కు గురైనట్లు అశ్విన్ తెలిపాడు. వెంటనే వారి వద్దకు వెళ్లగా అసలు విషయం తెలిసిందన్నాడు. వీసా కోసం తాను సమర్పించిన పాస్‌పోర్టును తిరిగి అందించేందుకే పోలీసులు వచ్చినట్లు తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నానని వివరించాడు. ఈ సందర్భంగా 'సెలబ్రిటీలకు కూడా ఇలాంటి సాధారణ అనుభవాలు ఎదురవుతాయా?' అని ఓ నెటిజన్ ప్రశ్నించగా.. తాను సాధారణ వ్యక్తిలా జీవించడానికే ఇష్టపడతానని అశ్విన్ సమాధానమిచ్చాడు. అశ్విన్ 2024 డిసెంబర్‌లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అనంతరం 2025లో ఐపీఎల్‌కు కూడా రిటైర్మెంట్ ప్రకటించాడు. భారత్ తరఫున అన్ని ఫార్మాట్లలో కలిపి 287 మ్యాచ్‌లు ఆడి 765 వికెట్లు సాధించాడు.

# అతీంద్రియ శక్తుల హర్రర్ స్టోరీ అగధ

ఈ వారం వరుస చిత్రాలు బాక్సాఫీస్‌కు క్యూ కట్టాయి. వాటిలో 'అగధ' ఒకటి. చిన్నప్పుడే తల్లిదండ్రుల్ని కోల్పోయిన ఓ యువతి మహాదేవి (కామాక్షి భాస్కర్ల). బాబాయ్ (భానుచందర్) దగ్గర వాళ్ల పిల్లలతో కలిసే పెరుగుతుంది. అనుకోకుండా ఓ రోజు ఓ దైవ శక్తి కనిపించి ఆమెను ఓ కొత్త మార్గంలో నడిపిస్తుంది. అప్పట్నుంచి ఆ శక్తి చెంతనే గడుపుతూ పెరిగి పెద్దదవుతుంది. అక్కడికి ఓ సాధువు వచ్చి కొన్ని యంత్ర, తంత్ర విద్యల్ని నేర్పించి, వాటిని ప్రజల మంచి కోసం ఉపయోగించాలని కోరతాడు. అప్పట్నుంచి ప్రజల్ని వేధించే అతీత శక్తుల నుంచి కాపాడుతూ పేరు సంపాదిస్తుంది. అందుకే ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో మహాదేవి అంటే ఎంతో పేరు. అలాంటి మహాదేవిని పెంచిన బాబాయ్ కుటుంబానికి అగధ అనే అతీత శక్తి నుంచి ముప్పు ఏర్పడుతుంది. గర్భంతో ఉన్న బాబాయ్ కూతురు ఆత్మహత్య చేసుకుంటుంది. ఆమెతోపాటు మరిన్ని మరణాలూ చోటు చేసుకుంటాయి. దాంతో తన కుటుంబాన్ని కాపాడుకోవడానికని సొంతూరికి వెళ్లాక అక్కడ మహాదేవికి ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి?ఇంతకీ అగధ ఎవరు?మహాదేవి కుటుంబాన్నే లక్ష్యంగా చేసుకోవడానికి కారణమేమిటి?దైవిక శక్తుల అండ ఉన్న మహాదేవికీ, అగధకీ మధ్య పోరాటం ఎలా సాగింది?ఎవరు గెలిచారన్నది చిత్ర కథ. చాలా రోజుల తర్వాత కేవలం భయాన్ని, థ్రిల్‌ని పంచడమే లక్ష్యంగా రూపొందిన సినిమానే... 'అగధ'. థ్రిల్లర్ సినిమాలకి తగ్గ వేగం ఇందులో కొరవడినా... ఆసక్తిని రేకెత్తించే కథా ప్రపంచంతోనూ, గాఢతతో కూడిన సన్నివేశాలతోనూ సినిమా చాలావరకూ లక్ష్యాన్ని అందుకుందీ చిత్రం. దైవ శక్తికీ, చీకటి శక్తికీ మధ్య సాగే పోరాటం చాలా సినిమాల్లో చూసినా అగధ చుట్టూ మలిచిన హారర్ సన్నివేశాలు, ద్వితీయార్ధంలో అనూహ్యమైన మలుపులు సినిమాని ప్రత్యేకంగా మార్చాయి. హత్యల వెనకున్న అసలు కారణాల్ని మహాదేవి తనకు తెలిసిన విద్యల్ని ఉపయోగిస్తూ పరిశోధించే తీరు సినిమాకి హైలైట్. అసలు గుహలో ఉన్న అగధ ఎవరనే అంశంతోపాటు, ఆ రోజు గుహలోపల ఏం జరిగిందనే విషయాల చుట్టూ సాగే ద్వితీయార్ధంలో అనూహ్యమైన మలుపులు రక్తికట్టిస్తాయి. ముఖ్యంగా కథానాయకుడి పాత్రలో రెండో కోణం, అగధ ఆత్మ తరచూ ఎవరో ఒకరిలోకి దూరిపోయి చేసే హంగామా ఆకట్టుకుంటాయి. అయితే, కథలో ఒక దశ దాటిన తర్వాత ఇన్ని మలుపులా అనిపిస్తాయి. పతాక సన్నివేశాల్లో కాలయంత్రంతో ప్రతినాయకుడిని బంధీగా మార్చడమనే అంశం కొత్తగా ఉంటుంది. మొత్తంగా చాలా రోజుల తర్వాత పూర్తిస్థాయి హారర్ థ్రిల్లర్ సినిమా అనుభూతిని పంచడంలో ఈ చిత్రం విజయం సాధించింది. కథకుడిగా కంటే దర్శకుడిగా సినిమాపై ప్రభావం చూపించారు ఎం.ఎస్.రాజు. అతీత శక్తులతో కూడిన కథా నేపథ్యం ఆసక్తిని రేకెత్తించినా, కథన రచన పాత పద్ధతుల్లోనే సాగింది. నిర్మాతగా ఆయన సినిమాల్లో కనిపించిన ప్రమాణాలకు తగ్గట్టుగానే, దర్శకుడిగా ఈ సినిమాని నాణ్యంగా తెరపైకి తీసుకొచ్చారు.






# టాక్సిస్ కోసం కియారా చాలా కష్టపడింది

## నటుడు యశ్ ప్రశంసలు



సినీ ప్రియులు ఎంతో ఎదురుచూస్తోన్న 'టాక్సిక్' మరికొన్నిరోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది . తాజాగా ఈ సినిమా ఆడియో లాంచ్ ఈవెంట్‌ను ముంబయిలో నిర్వహించారు. ఈ సందర్భంగా యశ్ మాట్లాడుతూ.. కియారపై మరోసారి ప్రశంసలు కురిపించారు. కియార నిబద్ధత ఉన్న నటి. ఆమె ఈ సినిమా షూటింగ్‌కు వచ్చినప్పుడు నేను కొంచెం ఆందోళన పడ్డాను. ఎందుకంటే ఈ పాత్ర చాలా కఠినంగా ఉంటుంది. వర్షంలో తడిసే ఓ సన్నివేశం సులభంగా అయిపోతుందని అనుకున్నాం. కానీ, దానికి చాలా సమయం పట్టింది. ఆమె చాలా కష్టపడింది. ఆమె ప్రెగ్నెంట్ అని తెలిసిన తర్వాత కూడా అంతే అంకిత భావంతో సెట్స్‌కు వచ్చింది. నాతో పాటు గీతూ మోహన్‌దాస్ కూడా చాలా టెన్షన్ పడింది. మేమిద్దరం సెట్‌లో కియారకు బౌన్సర్లు, బాడీగార్డ్‌లుగా మారి జాగ్రత్తగా చూసుకున్నాం. ఆమె పడ్డ కష్టానికి తగిన గుర్తింపు కచ్చితంగా వస్తుంది. ఈ సినిమా ఆమె కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలుస్తుందని అన్నారు. ఇక ఇటీవల బెంగళూరులో జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లోనూ కియారను యశ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సినిమా ప్రకటించినప్పటి నుంచి తాను ఎన్నో ఎదుర్కోవాల్సి వచ్చిందన్న యశ్.. ఎవరి మాటలనూ పట్టించుకోకుండా మనం చేయాల్సింది చేస్తూ వెళ్లడమేనని అన్నారు. ఇక ఈ సినిమా రన్‌టైమ్ 3 గంటల 11 నిమిషాలంటూ ప్రచారం జరుగుతోంది. సినిమాలో అధికంగా రక్తపాతం, యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి. వీటిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమాలో యశ్‌కు జోడీగా నయనతార, కియారా అడ్వాణీ, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి, తారా సుతారియా నటించారు.

# 16న ఇరుముడి ప్రీరిలీజ్ వేడుక




మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి' శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. కాగా, ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ ఒక క్రేజీ అనౌన్స్‌మెంట్ ఇచ్చారు. సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో చిత్ర యూనిట్ ప్రమోషన్ కార్యక్రమాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఆగస్టు 16న హైదరాబాద్‌లోని శిల్పకళా వేదిక వేదికగా 'ఇరుముడి' ప్రీ రిలీజ్ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. రవితేజ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'మల్లెపూల పల్లకి' పాటను విడుదల చేయనున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటూ యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతోంది. భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రంలో ప్రియా భవాని శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది.

# విశ్రాంతిని ఎంజాయ్ చేస్తున్న రష్మిక



టాలీవుడ్ ప్రముఖ నటి రష్మికా మందన్నా ప్రస్తుతం గాయం కారణంగా సినిమాలకు దూరంగా ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఈ రెస్ట్ సమయంలో తన ఆలోచనల్లో వచ్చిన మార్పుల గురించి ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న ఒక పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఎప్పుడూ తీరిక లేకుండా ఉరుకులు పరుగులతో బిజీగా గడిపేవారికి, ఒక్కసారిగా పనులు ఆపేసి విశ్రాంతి తీసుకోవడం మొదట్లో చాలా భయంగా అనిపిస్తుందని రష్మిక తెలిపారు. అయితే, తప్పనిసరి పరిస్థితుల్లో అలా విశ్రాంతి తీసుకోవాల్సి వస్తే.. గతంలో అలా పిచ్చివాళ్లలా పనుల వెనకే పరిగెత్తిన దినాలు ఇప్పుడు తలచుకుంటే మరింత భయంగా అనిపిస్తాయని, బహుశా జీవితం అంటే ఇదేమో అని ఆమె పేర్కొన్నారు. ఎలాంటి అలారాలు పెట్టుకోకుండా శరీరం కోరిన సమయానికి లేవడం, రోజుకు రెండు పూటల మితంగా భోజనం చేయడం, తన పెంపుడు కుక్క 'ఆరా'తో సమయం గడపడం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పుస్తకాలు చదవడం, పజిల్స్ చేయడం, ఇష్టమైన షోలు చూడటంతో పాటు పాత ఫోటోలు, వీడియోలను నెమరువేసుకుంటూ ప్రశాంతంగా గడుపుతున్నానని చెప్పారు. ఈ కష్టకాలంలో తాను త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ అభిమానులు, శ్రేయోభిలాషులు పంపిస్తున్న ప్రార్థనలకు, చూపుతున్న ప్రేమానురాగాలకు ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో వస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' చిత్ర షూటింగ్‌లో భాగంగా ఒక డ్యాన్స్ సీక్వెన్స్ చేస్తుండగా రష్మిక తుంటి భాగంలో గాయమైంది. వైద్యుల సూచన మేరకు ఆమె కొన్ని వారాల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి రావడంతో ప్రస్తుతం పూర్తిగా ఇంటికే పరిమితమయ్యారు.

# శ్రీను వైట్ల దర్శకత్వంలో శర్వానంద్





టాలీవుడ్‌లో మరో ఆసక్తికరమైన క్రేజీ కాంబినేషన్ అధికారికంగా పట్టాలెక్కింది. వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరించే చార్మింగ్ హీరో శర్వానంద్, విలక్షణమైన కామెడీ టైమింగ్‌తో కూడిన ఎంటర్‌టైనర్లను తెరకెక్కించే ప్రముఖ దర్శకుడు శ్రీను వైట్ల దర్శకత్వంలో తొలిసారిగా కలిసి పనిచేస్తున్నారు. వీళ్లిద్దరి కలయికలో రాబోతున్న ఈ సరికొత్త ప్రాజెక్ట్‌పై టాలీవుడ్ వర్గాల్లో మరియు ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అనిల్ సుంకర నిర్మాణంలో ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఈ చిత్రం తెరకెక్కుతుండగా తాజాగా ఈ సినిమా టైటిల్‌తో పాటు పూజా కార్యక్రమాలు ఘనంగా జరుపుకున్నారు. ఇక ఈ సినిమాకు మేకర్స్ 'జార్జ్ క్రిష్' అనే క్రేజీ టైటిల్‌ను ఖరారు చేశారు. శ్రీను వైట్ల మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్, శర్వానంద్ ఎనర్జిటిక్ యాక్టింగ్ ఈ సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలవనున్నాయి. సినిమా ప్రారంభోత్సవ రోజే విడుదల తేదీని ప్రకటించి మేకర్స్ అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇక ఈ పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. లాంచింగ్ రోజే రిలీజ్ డేట్ అనౌన్స్ చేయడంతో ఈ సినిమాపై ట్రేడ్ వర్గాల్లో కూడా మంచి బజ్ క్రియేట్ అయింది.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com